

పోలవరం కుడి ప్రధాన కాల్వ ఎస్ఈ శ్యాంప్రసాద్ బదిలీ

ఏలూరుసిటీ, డిసెంబరు 3:ఇరిగేషన్ శాఖకు సంబంధించి ఏలూరు పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ కుడి ప్రధాన కాల్వ (పీఐపీ ఆర్ఎంసీ) ఎస్ఈ బి.శ్యాంప్రసాద్ గుంటూరు బదిలీ అయ్యారు. విశాఖపట్నం ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈగా ఎస్ సుగుణాకరరావును పోలవరం కుడి ప్రధాన కాల్వ ఎస్ఈగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఓటేయడానికి వెళితే..

పాఠశాల నిర్వహణ ఎలా..?



- స్పెషల్ క్యాజువల్ లీవ్‌తో ఉపాధ్యాయ ఓటర్లలో డైలమా
- నేడు స్పష్టతనిస్తానన్న డీఈవో

ఏలూరు అర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో టీచర్లు ఓటుహక్కు వినియోగించుకోవడంపై డైలమా నెలకొంది. హైస్కూళ్లలో పదో తరగతి విద్యార్థుల కోసం ఎస్సీఈఆర్టీ ప్రకటించిన వంద రోజుల కార్యాచరణలో మార్చి 10 వరకు ఆదివారాలతో సహా (సంక్రాంతి సెలవుల్లో 3 రోజులు మినహా) ప్రత్యేక తరగతుల నిర్వహణను ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో తాజాగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు పోలింగ్ గురువారం జరుగనుంది. ఓటుహక్కు వున్న టీచర్లకు ఆ రోజున స్పెషల్ క్యాజువల్ లీవును మంజూరుచేస్తూ విద్యాశాఖ ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడే సమస్య వచ్చిపడింది. హైస్కూలులో బోధించే స్కూల్ అసిస్టెంట్ కేడర్ టీచర్లందరికీ దాదాపు ఓటుహక్కు ఉంటుంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ రోజున ఓటుహక్కు వినియోగించుకునేందుకు సంబంధిత టీచర్లందరూ స్పెషల్ సీఎల్‌ను వినియోగించుకుంటే స్కూలును లేదా వంద రోజుల కార్యాచరణను నిర్వహించడం అసాధ్యమైనందున ఆ రోజున స్కూలు అంతటికీ వర్తించేలా స్థానిక సెలవు (ఎల్‌హెచ్)ను ప్రకటించాలని ఉపాధ్యాయ సంఘాల డిమాండ్. ఒకవేళ ఓటుహక్కులేని ఒకరిద్దరు టీచర్లున్నా స్కూలును నిర్వహించడం సాధ్యం కాదని చెబుతున్నాయి.

ఈ విషయాన్ని డీఈవో వెంకటలక్ష్మమ్మ విద్యాశాఖ ఉన్నతాధికారులు, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పరిష్కారం కోసం మంగళవారం రాత్రివరకు ప్రయత్నించినట్టు సమాచారం. ఈ డైలమాపై డీఈవోను వివరణకోరగా.. 'ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరిగే కేంద్రాలకు(పాఠశాలలు) 4, 5 తేదీల్లో స్థానిక సెలవును ప్రకటించాం. ఈ రెండురోజులకు పరిహారంగా మరో రెండు సెలవు దినాల్లో స్కూలు పనిచేయాల్సి ఉంటుంది. ఇక ఓటుహక్కును వినియోగించుకోడానికి వీలుగా హైస్కూళ్లకు స్థానిక సెలవు ప్రకటించాలనే అభ్యర్థనలను ఉన్నతాధికారుల వద్దకు తీసుకెళ్లి వారి నిర్ణయాన్ని బుధవారం ప్రకటిస్తాం' అని వివరించారు.

షిఫ్ట్‌ల వారీగా విధులు..?

ఏలూరుజిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు మొత్తం 2667 మంది టీచర్ ఓటర్లున్నారు. ఈ సమస్యకు ప్రత్యామ్నాయ పరిష్కారంగా స్కూలులో ఓటుహక్కువున్న మొత్తం టీచర్లలో ఉదయం, మధ్యాహ్నం చెరిసగం మందికి షిఫ్ట్ మాదిరిగా ఓటు వేసేందుకు వెసులుబాటు కల్పించి, స్కూలు మూసివేయకుండా చర్యలు చేపట్టాలని ప్రతిపాదిస్తున్నారు. లేదా స్థానికంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడే ప్రత్యేక తరగతుల నిర్వహణకు అడ్జస్ట్‌మెంట్ చేసుకునేలా సూచనలు చేసే ప్రతిపాదనలు అధికారుల పరిశీలనలో వున్నట్టు తెలిసింది. దీనిపై మంగళవారం రాత్రి వరకు ఎటువంటి అధికారిక ప్రకటన లేదు. ఉన్నతాధికారుల సమీక్ష అనంతరం పాఠశాల మూసివేతపై స్పష్టత రానుంది.



ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఘట్టం తుది దశకు చేరుకుంది. గురువారం పోలింగ్ జరగనుంది. జిల్లావ్యాప్తంగా 20 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎన్నికల ప్రచారం మంగళవారం ముగిసింది. ఈ ఎన్నికల్లో ఓటింగ్‌కు బ్యాలెట్ పత్రాలను వినియోగిస్తారు. ఎన్నికల కోడ్ అమలులో ఉంది కాబట్టి మంగళవారం సాయంత్రం నాటికే ఎక్కడికక్కడ మద్యం దుకాణాలను బంద్ చేశారు. ఎన్నికల బరిలో ఐదుగురు అభ్యర్థులు తలపడుతున్నారు. అభ్యర్థులను గెలిపించే బాధ్యతను ఆయా ఉపాధ్యాయ సంఘాలు భుజానికెత్తుకున్నాయి.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక

పోటా పోటీ

రేపే పోలింగ్.. ముగిసిన ప్రచారం

- పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి
- జిల్లావ్యాప్తంగా 20 కేంద్రాలు
- మొత్తం ఓటర్ల సంఖ్య 2,605
- బ్యాలెట్ పత్రాల వినియోగం
- మద్యం దుకాణాలు బంద్



(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఏలూరు జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు వీలుగా అన్ని ఏర్పాట్లు కొలిక్కి వచ్చాయి. ఇప్పటికే ప్రచారంలో అభ్యర్థులంతా నువ్వానేనా అన్నట్టుగా తలపడ్డారు. బొర్రా గోపిమూర్తి, గంధం నారాయణరావు, దీపక్, కవల నాగేశ్వరరావు, వెంకటలక్ష్మి పోటీలో ఉన్నారు. వీరిలో గోపిమూర్తి, గంధం నారాయణరావు మధ్య భారీ పోటీ నెలకొంది. ఇప్పటికే వీరిద్దరికి ఉపాధ్యాయ సంఘాలు మద్దతు ఇచ్చాయి.

బరిలో ఐదుగురు అభ్యర్థులు





ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఈ ఎన్నిక నిర్వహించాల్సి వచ్చింది. గడిచిన పక్షం రోజులుగా జిల్లాలో ఉన్న ఉపాధ్యాయులందరినీ వ్యక్తిగతంగాను, పాఠశాలలు, వారి నివాసాల్లోను కలిసి మద్దతు కోరారు. తొలిసారిగా గోపిమూర్తి బరిలో ఉండగా, గంధం నారాయణరావుకు మరో సారి అదృష్టాన్ని పరిశీలించుకోబోతున్నారు. ఉపాధ్యాయ వర్గాలు కూడా ఎక్కడికక్కడ తామే బాధ్యత వహించి ప్రచారంలో అభ్యర్థుల పక్షాన ప్రచారం నిర్వహించారు. గోపిమూర్తికి యూటీఎఫ్‌తో పాటు పలు సంఘాలు మద్దతు ఇవ్వగా, గంధం నారాయణరావుకు ఎస్టీయూ, మరికొన్ని సంఘాలు మద్దతు ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలో పోటీ నువ్వానేనా అన్నట్టుగా గడిచిన మూడు రోజులుగా మారిపోయింది. సీనియర్ అయిన తనకు ఒక అవకాశం ఇస్తే ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామని గంధం నారాయణరావు ప్రచారం చేయగా, షేక్ సాబ్జీ మరణానంతరం ఉపాధ్యాయుల హక్కులను కాపాడే సత్తా తమకే ఉందని, తాము బలపరిచే అభ్యర్థి గోపిమూర్తికి ఓటు వేయాలని యూటీఎఫ్ కోరుతుంది. వామపక్షాలు రెండు చెరోవైపు విడిపోయి మరీ భారీ ఎత్తున గడిచిన వారం రోజుల్లో ప్రచారాన్ని హోరెత్తించాయి.

గతం కంటే భిన్నంగా..

ఈసారి ఎమ్మెల్సీ స్థానానికి జరుగుతున్న ఎన్నికల్లో గతంకంటే భిన్నమైన పరిస్థితే అభ్యర్థుల మధ్య నెలకొంది. గతంలో ఓటర్లను ఆకర్షించేందుకు పెద్ద ఎత్తున తాయిలాలు విసిరారు. డబ్బు చేతులు మారింది. ఉపాధ్యాయులను ప్రసన్నం చేసుకోవడానికి వివిధ రకాల ప్రయత్నాలు చేశారు. ప్రచారాన్ని సాధారణ ఎన్నికలను తలపించేలా హోరెత్తించారు. కాని ఈసారి మాత్రం దానికి భిన్నంగా ప్రచారంలో అభ్యర్థులు ఉన్నా, లేకపోయినా వారికి మద్దతు ఇచ్చిన సంఘ సభ్యులే ప్రచారాన్ని భుజానకెత్తుకున్నారు. మంగళవారం సాయంత్రంతో ప్రచారం ముగిసింది. రాబోయే 24 గంటల్లో గతంలో మాదిరిగానే ఓటర్లను ఆకర్షించేందుకు అభ్యర్థులు ఎవరైనా సాహసం చేస్తారా అనే సందిగ్ధత లేకపోలేదు. ఈ దిశగానే ఓటర్లలో కొందరు తాయిలాల కోసం ఇప్పటి నుంచే ఆరా తీయడం ప్రారంభించారు.

పోలింగ్‌లో బ్యాలెట్ పత్రాల వినియోగం



ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఈసారి పోలింగ్‌లో బ్యాలెట్ పత్రాలను వినియోగిస్తున్నారు. ఈ మేరకు నిర్దిష్ట ఆదేశాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా దాదాపు 2605 మంది ఓటర్లు ఉండగా వారంతా కూడా ప్రాధాన్యత క్రమంలో బ్యాలెట్‌లోనే పోటీ చేస్తున్న వ్యక్తులకు మద్దతు పలుకుతూ టిక్ పెడతారు.

జిల్లా వ్యాప్తంగా 20 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కుక్కునూరు, వేలేరుపాడు, జీలుగుమిల్లి, బుట్టాయిగూడెం, పోలవరం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, టి.నర్సాపురం, కామవరపుకోట, ద్వారకాతిరుమలలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. చింతలపూడి, లింగపాలెం, ఉంగుటూరు, భీమడోలు, పెదవేగి, పెదపాడు, ఏలూరురూరల్, ఏలూరు అర్బన్, దెందులూరు, నిడమర్రు వంటి కేంద్రాల్లోని పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఎన్నికల అధికారులు తెలిపారు.

విధులు సర్దుబాటు చేయాలి

పోలింగ్ గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తారని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ప్రకటించారు. జిల్లాలో అన్ని ప్రైవేటు మేనేజ్‌మెంట్‌లు, అథారిటీలు, ఓటరుగా ఉన్న తమ ఉద్యోగులకు అవసరమైన సౌకర్యాలు అంటే డ్యూటీకి ఆలస్యంగా రావడం, షిఫ్ట్ సర్దుబాటును చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. పోలింగ్ సవ్యంగా సాగేలా ఎక్కడికక్కడ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పోలింగ్‌కు ముందుగానే మంగళవారం మద్యం దుకాణాలను, బార్‌లను ఎక్కడికక్కడ మూసివేశారు. మంగళవారం సాయంత్రం నుంచి దుకాణాల మూత జరిగిందో, లేదో అధికారులు పర్యవేక్షించారు. ఈనెల 9న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఎన్నికల కోడ్ అప్పటిదాకా అమలులో ఉంటుంది.



రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న జేసీ

ధాన్యం దళారుల దందాపై కఠిన చర్యలు : జేసీ

ద్వారకాతిరుమల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడైనా రైతును మభ్యపెట్టి దళారులు అక్రమంగా ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జేసీ పి.ధాత్రిరెడ్డి హెచ్చరించారు. మండలంలోని నారాయణపురం రైతు సేవా, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. ముందుగా ధాన్యం సేకరణ తీరుతెన్నులను తనిఖీ చేశారు. మూడు రోజులుగా వాతావరణ ప్రతికూలత వల్ల ఏర్పడిన పరిస్థితులను సమీక్షించారు. ధాన్యం సేకరణలో రెవెన్యూ సహకారం ఎంత వరకూ ఉందో రైతులను అడిగి తెలుసుకున్నారు. తేమ 17 శాతం వచ్చేవరకూ ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలని సూచించారు. ఈ విధంగా ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలిచ్చారు. తహసీల్దారు సుబ్బారావు, మండల వ్యవసాయాధికారి దుర్గామేష్, వీహెచ్ఏ నిహారిక తదితరులు పాల్గొన్నారు.

1.59 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మి

ఏలూరుసిటీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇప్పటివరకు రూ.367.63 కోట్లు విలువైన 1,59,782.960 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ వి.శ్రీలక్ష్మి తెలిపారు. ఉంగుటూరు నియోజకవర్గంలో రూ. 145.20 కోట్లు విలువైన 63,344.240 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. చింతలపూడి నియోజకవర్గంలో 21,094.560 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 2498 మంది రైతుల వద్ద నుంచి కొనుగోలు చేశామన్నారు. తుపాన్ నేపథ్యంలో గరిష్ఠంగా 5 కేజీల తరుగుతో తేమ 25 శాతం ఉన్నా కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతు కోరిన రైస్‌మిల్లుకు తరలించినట్లు ఆమె తెలిపారు. ధాన్యాన్ని తరలించిన 48 గంటలలోపే రైతు బ్యాంకు ఖాతాలో సొమ్ము జమ చేస్తున్నట్లు వివరించారు. వ్యవసాయ శాఖ క్షేత్రస్థాయిలో ఈ-పంట, ఈ-కేవైసీ ద్వారా రైతుల వివరాలు నమోదు చేశారని, పారదర్శకంగా ధాన్యం కొనుగోలు జరుగుతోందన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను జిల్లా స్థాయిలో కంట్రోల్‌రూమ్ ద్వారా పర్యవేక్షణ చేస్తున్నామన్నారు.



గుండుగొలను వంతెన నిర్మాణం

అసంపూర్తి

- పనులు చేపట్టి రెండేళ్లు గడిచింది
- 50 శాతం కూడా పూర్తి కాలేదు
- 15 గ్రామాలకు ముప్పు

దెందులూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గుండుగొలను (శింగగూడెం) వంతెన నిర్మాణంలో జాప్యం పరిసర గ్రామాల ప్రజలకు శాపంగా మారింది. గత వైసీపీ పాలనలో ప్రజా ప్రతినిధులు, అధికారులకు ముందుచూపు కొరవడడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో రెండేళ్లుగా గుండుగొలను వంతెన నిర్మాణ పనులు కనీసం సగం కూడా పూర్తి కాలేదు.

శింగగూడెం వద్ద వంతెన లేకపోవడంతో గుండుగొలను, పోతునూరు, లక్ష్మీపురం, భోగాపురంతో పాటు 15 గ్రామాల ప్రజలు జాతీయ రహదారిపై సుమారు 600 మీటర్లు రాంగ్ రూట్‌లో వెళ్లాల్సి ఉంది. నిబంధనలకు విరుద్ధమైన రాకపోకలతో రెండేళ్ల వ్యవధిలో 11 ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. ఈ ప్రమాదాల్లో 16 మంది గాయాల పాలయ్యారు. విద్యార్థులు సైతం రాంగ్ రూట్‌లో వెళ్లాల్సి రావడంతో తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వంలో వంతెన నిర్మాణానికి పనులు ప్రారంభమైనప్పటికి కాంట్రాక్టర్, హైవే అధికారులు పట్టనట్లు వ్యవహరించారు. కాలువలో నీటి ప్రవాహం సమస్య, భారీ క్రేన్లు దొరకడం లేదని సాకులు చూపుతున్నారు. ఏడాది క్రితం గోదావరి కాలువ రెండు వైపులా వంతెన నిర్మాణానికి పిల్లర్స్ పూర్తి చేశారు. ఎనిమిది నెలల క్రితం ఆ పిల్లర్స్‌పై మూడు భారీ గడ్డర్స్ నిర్మాణం పూర్తి చేశారు. కాలువలో నీటి ప్రవాహం ద్వారా రైతులు ఇబ్బందులు పడకుండా ఇరిగేషన్ శాఖ ద్వారా భారీ పైపులు వేసి రోడ్డు నిర్మించారు. క్రేన్లతో గడ్డర్స్ తీసుకువచ్చి పిల్లర్స్‌పై వంతెన నిర్మాణం చేయాల్సి ఉంది. తూరలు తీసుకుని వచ్చి పక్కన ఉంచి రెండు నెలలు గడుస్తున్నాయి. ప్రస్తుతం కాంట్రాక్టర్ పనులు చేస్తున్నప్పటికి నత్తడనడన సాగుతుండడంతో నిర్మాణం మరింత సమయం పట్టే అవకాశం ఉంది. కాల్వ ద్వారా సాగునీరు అందించడానికి ముందే వంతెన పనులు పూర్తి చేయాలని 15 గ్రామాల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

15 గ్రామాల సమస్య



గుండుగొలను వంతెన 15 గ్రామాల ప్రజల సమస్యకు పరిష్కాం. విద్యార్థులు, ఆక్వా రైతులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రెండు రోజుల నుంచి పని వేగం పెంచారు. మరింత పెంచి వంతెన పూర్తి చేయాలి. పనులు చేపట్టి రెండేళ్లు గడిచినా ఇంతవరకు 50 శాతం పనులు కూడా పూర్తి కాలేదు.

- టి.సుమన్, ఛైర్మన్, గుండుగొలను వంతెన సాధన కమిటీ

రహదారి సమస్యలు పరిష్కరించండి

- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ఎంపీ పుట్టా మహేశ్ వినతి



కేంద్రమంత్రిని కలిసిన ఎంపీ పుట్టా

ఏలూరు టూటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏలూరు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో జాతీయ రహదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కేంద్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ఎంపీ పుట్టా మహేష్ విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలోని రవాణా భవన్‌లో మంగళ వారం కేంద్ర మంత్రికి ఎంపీ వినతిపత్రం ఇచ్చారు.

- ఎన్‌హెచ్- 216ఏ లో రైల్వే ఓవర్ బ్రిడ్జి నుంచి గుండుగొలను వరకు నిర్మించిన సర్వీస్ రోడ్ల వెంబడి లైటింగ్‌ను మెరుగుపరచాలి. ప్రమాదాల నివారణకు పోలీసు పెట్రోలింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను పెంచాలి.
- ఉంగుటూరు నియోజకవర్గంలోని గుండుగొలను, భీమడోలు, కూరెళ్లగూడెం, పూళ్ల, కైకరం, చేబ్రోలు, నారాయణపురం, ఉంగుటూరు రెండు కిలోమీటర్ల మేర ఫ్లైఓవర్, సబ్ వేలను నిర్మించాలి.
- కొత్తగూడెం, దెందులూరు మండలం సీతంపేటలో 2020-2023 మధ్య రోడ్డు పనులు చేపట్టినా, సరైన రక్షణ ఏర్పాట్లు లేకపోవడంతో, విద్యార్థులు, కూలీలు, 200 గ్రామాల ప్రజలు రహదారి దాటే క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. రెండేళ్లలో 10 మంది మృత్యువాత పడగా 40 మంది గాయపడ్డారు.
- ఎన్‌హెచ్ -16 సీతంపేట జంక్షన్ వద్ద 4 మీటర్ల ఎత్తు బాక్స్ కల్వర్ట్ లేదా పీయూపీ, సీయూపీ నిర్మాణం, గుండుగొలను దేవరపల్లి-కొవ్వూరు సెక్షన్‌లో ఓవర్‌బ్రిడ్జి మధ్య సర్వీస్ రోడ్డు, హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి.
- గుండుగొలను నుంచి కొవ్వూరు రోడ్డు వరకు ఎన్‌హెచ్- 16లో అత్యంత ప్రాధాన్యతగా పరిగణిస్తూ చర్యలు తీసుకోవాలి.
- ఏలూరు జిల్లా పరిధిలోని ఖమ్మం-దేవరపల్లి 365 నేషనల్ హైవే గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్ట్ వెంబడి సర్వీస్ రోడ్లు మంజూరు చేయాలి.
- లింగగూడెం, కమలాపురం, రాఘవాపురంలో పామాయిల్ రైతులు పండించిన పంట ఉత్పత్తులు తరలించడానికి వీలుగా కనెక్టివిటీ రోడ్డు నిర్మించాలి.
- చింతలపూడి మండలం లింగగూడెం, కమలాపురం, రాఘవాపురం గ్రామాల రైతులు సరైన అప్రోచ్ రోడ్డు లేకపోవడంతో పామాయిల్ తోటలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు.
- జీలుగుమిల్లి నుంచి కొవ్వూరు రోడ్డు వయా కన్నాపురం వరకు మొదట ప్రతిపాదించిన అలైన్‌మెంట్‌ను పరిగణనలోకి తీసుకుని హైవే వెళ్లేలా అనుమతించాలి.
- నూజివీడు - ఏలూరు వయా ముసునూరు రహదారిలో తుక్కులూరు వద్ద ఫ్లైఓవర్ నిర్మించాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు.

ఎలా కొనాలి.. ఏం..తినాలి ? నిత్యావసర సరుకుల ధరలన్నీ పైపైకి 7

ఆళ్ల నానీ.. ఆగండి

- సీఎంతో చర్చలు వాయిదా..
- ఏలూరులో తీవ్ర వ్యతిరేకతే కారణం
- అందుబాటులో ఎంపీ పుట్టా, జిల్లా అధ్యక్షుడు గన్ని
- ఉండవల్లి వైపు చూడని ఏలూరు ఎమ్మెల్యే చంటి
- టీడీపీలో చేరిక 9వ తేదీకి వాయిదా



7
సంక్రాంతికి ముందే సై జిల్లాలో కోడిపందేల జోరు

వైకల్యం అధిగమించి ముందుకు సాగాలి



బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వైకల్యం శరీరానికే కాని సంకల్పానికి కాదని, విభిన్న ప్రతిభావంతులు మనోధైర్యంతో ముందుకు సాగాలని కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి వేడుకలు జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఏడీ రామ్‌కుమార్ అధ్యక్షతన మంగళవారం జరిగాయి. కలెక్టర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు అన్నివిధాలా అండగా ఉంటామన్నారు. వారు అందరితో సమానంగా అన్నిరంగాల్లో రాణిస్తున్నారన్నారు. వారిలో సాధారణ వ్యక్తుల కంటే ఎక్కువ ప్రతిభ దాగి ఉంటుందన్నారు. దానిని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను అందిపుచ్చుకుని ముందుకు వెళ్లాలన్నారు. ప్రతినెల 4వ శనివారం దివ్యాంగుల కమిటీ సమావేశం నిర్వహిస్తామని సమస్యలను చర్చించుకోవచ్చన్నారు. చక్కని స్వరంతో పాటపాడిన డిగ్రీ విద్యార్థిని లహరిని కలెక్టర్ అభినందించారు. అనంతరం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ కేక్ కట్ చేశారు. ఇటీవల జరిగిన క్రీడాపోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను, వివిధ కళలు ప్రదర్శించిన వారికి బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నక్కా సూర్య చంద్రరావు, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, సెట్‌వెల్ సిఈవో ప్రభాకర్, ఆయాశాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



హుండీ ఆదాయం లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది, సేవకులు

మావుళ్ళమ్మ హుండీ ఆదాయం 70.07 లక్షలు

భీమవరం టౌన్, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి) : మావుళ్ళమ్మ హుండీ ఆదాయం మంగళవారం లెక్కించారు. మూడు నెలలకు గాను 70 లక్షల 07 వేల 033 రూపాయలు వచ్చిందని దేవస్థానం సహాయ కమిషనర్ బుద్దా మహాలక్ష్మి నగేష్ తెలిపారు. దీంతోపాటు 133 గ్రాముల 500 మిల్లీ గ్రాముల బంగారం, 880 గ్రాముల వెండి వచ్చిందన్నారు. విదేశీ కరెన్సీ కూడా లభించిందన్నారు. లక్షా 4 వేల 177 రూపాయిలు అన్నదానం నిమిత్తం వచ్చాయని వివరించారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు పర్యవేక్షించారన్నారు. ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల మల్లిఖార్జునశర్మ, ఆలయ సిబ్బంది, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



ద్వారకాతిరుమలలో సోలార్ పవర్‌ప్లాంట్‌కు అవసరమైన స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ ధాత్రిరెడ్డి

సోలార్ పవర్ ప్లాంట్ స్థలం పరిశీలించిన జేసీ

ద్వారకాతిరుమల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మోడల్ సోలార్ విలేజ్ ద్వారకాతిరుమలలో మొదటిసారిగా ఏపీ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో పైలట్ సోలార్ ప్రాజెక్ట్ కింద 750 కెడబ్లూపి సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని జేసీ ధాత్రిరెడ్డి మంగళవారం పరిశీలించారు. ట్రాన్స్‌కో పర్యవేక్షక ఇంజనీర్ సాల్మన్‌రాజు,ఈఈ అంబేడ్కర్ ఆమెకు ప్లాంట్ వివరాలు తెలిపారు. అనంతరం పీఎం సూర్యఘర్ యోజన పథకంపై గృహ విద్యుత్ వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈఈలు శశిధర్, గోపాలకృష్ణ సోలార్ వెండర్స్, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు. అంతకు ముందు ఆమె చిన వెంకన్నను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుల నుంచి వేదాశీర్వచనం, ప్రసాదం పొందారు.



షష్ఠి ఉత్సవాలకు ముస్తాబు



అత్తిలి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) :అత్తిలి గ్రామ ఇలవేల్పుగా గుర్తింపు పొందిన వల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో షష్ఠి ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి కళ్యాణం రంగరంగ వైభవంగా నిర్వహిస్తారు.15 రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. వల్లి దేవసేన సమేతుడైన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి అత్తిలిలో ఏకశిలా షణ్ముఖిగా పూజలు అందుకుంటున్నారు. షష్ఠి తిరునాళ్ళు బుధవారం నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. 15 రోజుల పాటు జరిగే షష్ఠి తిరునాళ్ళకోసం భారీ ఎత్తున చలువ పందిళ్ళు నిర్మించారు. రంగురంగుల విద్యుత్ దీపాలతో భారీ కటౌట్లను ఏర్పాటు చేశారు. భక్తుల దర్శనం కోసం ప్రత్యేకంగా లైన్లను ఏర్పాటు చేశారు. అత్తిలికి చెందిన కూనపరెడ్డి తేజ, విజయలక్ష్మి దంపతులు శుక్రవారం సాయంత్రం కల్యాణం జరుపుతారు. అనంతరం భక్తులు దర్శనాలకు అనుమతిస్తారు. శనివారం తీర్థ మహోత్సవం జరుగుతుంది. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం అత్తిలి ఉన్నత పాఠశాల వద్ద అన్న సమారాధన నిమిత్తం పందిళ్ళు నిర్మించారు.ఉత్సవాల రోజుల్లో రోజూ వేలాది మందికి అన్న సమారాధన జరుపుతారు. శనివారం రాత్రి భారీ ఊరేగింపు నిర్వహిస్తారు. ఉత్సవాల సందర్భంగా 20 వరకు పెద్ద ఎత్తున నాటకాలు, బుర్రకథలు, సంగీత విభావరి, సినీ మ్యూజికల్ నైట్ వంటి కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు షష్ఠి కమిటీ చైర్మన్ కురెళ్ళ ఉమామహేశ్వరరావు తెలిపారు. షష్ఠి ఉత్స వాల సందర్భంగా ఎందరో కళాకారులను సత్కరిస్తుంటారు. స్వర్గీయ ఎస్వీ రంగారావును ఏనుగు అంబారీపై ఊరేగించడంతో పాటు ఘనంగా సన్మానించారు. రేలంగి, చిరంజీవి తదితర నటులు సత్కారం పొందారు. ఉత్సవ కమిటీ కార్యదర్శి దాడి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు దిరిశాల మాధవరావు, కోశాధికారి ఇర్రి వెంకట సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. తణుకు సిఐ కృష్ణకుమార్ ఆధ్వర్యంలో 250 మంది పోలీసులతో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు అత్తిలి ఎస్ఐ ప్రేమరాజు తెలిపారు.

కైకరం షష్ఠి ఉత్సవాలకు 90 సంవత్సరాలు



ఉంగుటూరు, డిసెంబరు 3: కైకరంలోని శ్రీ వల్లీదేవసేన సహిత శ్రీసుబ్రహ్మణ్యా స్వామి వారి 90వ ఉత్సవాలు ఈనెల 6వ తేదీ రాత్రి స్వామివారి కళ్యాణంతో ప్రారంభమవుతాయని ఆలయ నిర్వాహక కమీటీ తెలిపింది.1935లో అద్దేపల్లి కొండయ్య సతీమణి సోమాయమ్మల ఆధ్వర్యంలో స్వామివారిని ప్రతిష్ఠించి ప్రతి యేటా ఉత్సవాలు నిర్వహించడం పరిపాటి. పిల్లలు పుట్టనివారు స్వామిని మొక్కుకుంటే పిల్లలు పుడతారని నమ్మకం.ఈ ఏడాది వారం రోజుల పాటు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నారు. ప్రతి రోజు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

పడమరవిప్పర్రులో ..



పెంటపాడు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోనే ప్రసిద్ధి గాంచిన పడమర విప్పర్రు స్వయంభూ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం షష్ఠి ఉత్సవాలకు ముస్తాబవుతోంది. మంగళవారం ఆలయ అర్చకులు కొడవటిగంటి నర్సింహాచార్యులు, జనార్ధనాచార్యుల బ్రహ్మత్వంలో ప్రత్యేక పూజలు చేశారు. ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న గ్రామ మాజీ సర్పంచ్ పసల గంగా రామ చంద్రన్ (చంటి) మాట్లా డుతూ 6వ తేదీన ఆలయ ప్రాంగణం వద్ద స్వామివారికి కళ్యాణం, 7వ తేదీన షష్ఠి మహో త్సవాలు, సుమారు 40 వేల మందికి భారీ అన్న సమారాధన ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 9వ తేదీన ఆలయ ప్రాంగణంలోని కోనేరు వద్ద స్వామి వారికి ఘనంగా తెప్పోత్సవం జరుగు తుంద న్నారు. అధిక సంఖ్యలో భక్తులు హాజ రయ్యే అవకాశం ఉన్నందున భక్తులకు ఎటు వంటి అసౌకర్యం లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నా మన్నారు. మాజీ ఎంఎల్ఏ పసల కనక సుందర్రావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు పసల అచ్యుతం, పసల గంగన్న, సత్యనారాయ ణమూర్తి పాల్గొన్నారు.

ఎలా కొనాలి.. ఏం..తినాలి ?




నిత్యావసర ధరలన్నీ పైపైకి

నిత్యావసర ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. సామాన్యులు షాపులకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. పెరుగుతున్న ధరలు సామాన్యులకు భారంగా మారాయి. అన్నిరకాల ధరలు పెరగడంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితుల్లో ప్రజలున్నారు. బియ్యం, పప్పులు, నూనెలు, కూరగాయలు, చికెన్, కోడిగుడ్లతో సహా అన్నిరకాల ధరలు రోజురోజుకి పెరుగుతూనే పోతున్నాయి. ఏం కొనాలి.. ఎలా తినాలనే పరిస్థితిలో సామాన్యుడు ఉన్నాడు..

సామాన్యులకు భారం
భయపెడుతున్న బియ్యం ధరలు
వంటనూనెలు సలసల
కంటతడి పెట్టిస్తున్న కూరగాయలు



ఏలూరు టూటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బియ్యం ధరలు సామాన్యులకు భారంగా మారాయి. సోనామసూరి కేజీ రూ.65కు చేరుకుంది. పీఎల్ రూ.55 -65 వరకు అమ్ముతున్నారు. కందిపప్పు కేజీ రూ.180 అయ్యింది. మినపప్పు రూ.140, పెసరపప్పు రూ.140లకు చేరుకున్నాయి. కేంద్ర ప్రభుత్వం వంటనూనెలపై దిగుమతి సుంకం పెంచడంతో వంటనూనె ధరలు కేజీకి గత రెండు నెలల్లోనే రూ.30 పెరిగింది. వేరుశనగ నూనె కేజీ రూ.200, సన్‌ఫ్లవర్ రూ.180, నువ్వులనూనె రూ.480, రైస్‌రిచ్ ఆయిల్ రూ.170, కొబ్బరినూనె రూ.300కు చేరుకుంది. గత ఆరు నెలలతో పోలిస్తే నిత్యావసర వస్తువుల ధరలు 20 నుంచి 40 శాతం వరకు పెరిగాయి. ఈ ధరలు సామా న్యులను తీవ్రంగా భయపెడు తున్నాయి. ధరలు తగ్గకపోయినా పర్వాలేదు.. స్థిరంగా ఉంటే చాలనే పరిస్థితుల్లో ప్రజలు ఉన్నారు.





కూరగాయల ధరలు కూడా సామాన్యులకు అందుబాటులో లేవు. ప్రతిరోజు వంటల్లో వాడే ఉల్లిపాయలు, టమోటా ధరలు మోత మోగిస్తున్నాయి. మూడు నెలల నుంచి ఉల్లిపాయలు కేజీ రూ.60 పైమాటే. ప్రతీ కూరలో వాడే టమోటాలు రూ.50కి చేరుకున్నాయి. వంకాయలు కేజీ రూ.50, బీరకాయలు రూ.60, క్యారెట్ రూ.70లకు ఎగబాకాయి. బెండ, దొండకాయలు, గోరుచిక్కుళ్ళు రూ.40 పైమాటే. ఎన్నడూ లేనంతగా దోసకాయలు, ఆనబకాయలు, పొట్లకాయలు, రూ. 30-40 పలుకుతున్నాయి. చిక్కుళ్ళు రూ.80కి ఎగబాకాయి. ఆకు కూరలు కట్ట రూ.20 తక్కువ లేదు. సెప్టెంబరు, అక్టోబరు మాసాల్లో వచ్చిన వానలు, వరదలకు కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. దీంతో దిగుబడి తగ్గి ధరలు పెరిగిపోయాయి. కార్తీకమాసం రావడంతో మరింత పెరిగాయి.

కార్తీకమాసం ముగియగానే చికెన్ ధరలు అమాంతం పెరిగిపోయాయి. కేజీ స్కిన్‌లెస్ చికెన్ రూ.240కి ఎగబాకింది. కోడిగుడ్ల ధరలు సాధారణంగా రూ.5 నుంచి రూ.7వరకు పెరిగింది. మటన్ రూ.900కు చేరుకుని సామాన్యుడికి అందుబాటులో లేదు. వెల్లుల్లి ఐదు నెలల క్రితం కేజీ రూ.150 ఉండగా ఇప్పుడు కిలో రూ.400 అమ్ముతున్నారు. ఇలా అన్ని రకాల ధరలు విపరీతంగా పెరిగిపోతుండటంతో సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సామాన్యుడు బతకలేని పరిస్థితి



అన్నిరకాల ధరలు విపరీతంగా పెరగటంతో ప్రజల బ్రతుకు ప్రశ్నార్ధకమైంది. కొన్నిసార్లు అర్ధకాలితోనే పడుకోవాల్సి వస్తుంది. కూరగాయల దగ్గర నుంచి ఉప్పులు, పప్పులు, బియ్యం, చింతపండు ఇలా ఒకటేమిటి సామాన్యులకు అందు బాటులో లేవు. అటు పంట పండించిన రైతు నష్టపోతున్నాడు. మరోపక్క వినియోగదారుడు భరించలేని స్థితిలో ధరలున్నాయి. దళారీ వ్యవస్థ కారణంగా ధరలు విపరీతంగా పెంచేస్తున్నారు. దళారీ వ్యవస్థను అరికట్టడమే కాకుండా ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

-కే.నరసింహనాయుడు, ఏలూరు

సమాజానికి ఉపయోగపడే ప్రయోగాలు

తాడేపల్లిగూడెం పాలిటెక్నిక్ కళాశాలలో అంతర్ జిల్లా టెక్ ఫెస్ట్
ఆకట్టుకున్న ప్రాజెక్టులు

తాడేపల్లిగూడెం రూరల్ డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం ప్రారంభమైన అంతర్ జిల్లా టెక్‌ఫెస్ట్‌లో విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.సాంకేతికతను ఉపయోగించు కుంటూ నేటి సమాజానికి అవసరమైన ప్రయో గాలను ప్రదర్శించారు. ఆ ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని 13 పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 123 మంది విద్యార్థులు 48 ప్రాజెక్టులు ప్రదర్శించారు. ఈ ప్రాజెక్టులకు మొదటి ద్వితీయ బహుమతులతో పాటు ఉత్తమ ప్రాజె క్టులను జనవరి 6,8 తేదీల్లో విజయవాడలో నిర్వ హించే రాష్ట్ర స్థాయి టెక్ ఫెస్ట్‌కు ఎంపిక చేస్తారని ప్రిన్సిపాల్ డి.ఫణీంద్ర ప్రసాద్ తెలిపారు. ఈ ప్రదర్శనలో కొన్ని ప్రదర్శనలు ఇవీ..

నమూనా సబ్‌స్టేషన్



ప్రతీ కళాశాలలో విద్యార్థులకు పుస్తకాల్లో తగినంత సమాచారం ఉంటుంది. కానీ ఆ పుస్తకాల్లో కాకుండా ఫీల్డ్ విజిట్ చేస్తే కానీ అన్ని విషయాలు అర్థం కావు. ఓ సబ్ స్టేషన్‌లో ఉండే ప్రతీ అంశాన్ని వివరించే విధంగా తయారు చేసిన నమూనా సబ్‌స్టేషన్ ఆకట్టుకుంది. ఈ ప్రాజెక్టును తణుకు పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఫణీంద్రప్రసాద్ నేతృత్వంలోని బృందం ప్రదర్శించారు.

సెన్సార్ పార్కింగ్



మనం తరచూ సినిమాహాల్స్, ఫంక్షన్ హాల్స్, షాపింగ్‌మాల్ ఇలా అన్నింటిలోనూ పార్కింగ్‌లో ఇబ్బంది పడుతుంటాం. అలాంటి ఇబ్బంది లేకుండా ఓ పార్కింగ్ ప్రాంతంలో ఎన్ని వాహనాలు ఉన్నాయి.. ఎన్ని పడతాయి.. అనే డిస్ప్లే బోర్డు పెట్టడం ద్వారా అక్కడ ఇబ్బంది లేకుండా చూసుకోవడంతో పాటు, ఆ పార్కింగ్ ప్రాంతంలో సెన్సార్ గేటు ఏర్పాటు ద్వారా ఇటు కార్లు,మోటారు సైకిల్స్ వాహనదారులు ఇబ్బంది లేకుండా ఉండేలా దీన్ని రూపొం దిం చారు.. నరసాపురం స్వర్ణాంధ్ర పాలిటెక్నిక్ విద్యార్థులు ఎలీజా బృందం రూపొందించిన ఈ ప్రాజెక్టు అందరినీ ఆకట్టుకుంది.

ఎనర్జీ రీచార్జిబుల్ సైకిల్



ప్రస్తుతం విద్యుత్తు మోటారు సైకిల్స్ కాలం నడుస్తోంది. ఈ సమయంలో ఈ వాహనాలకు చార్జింగ్ సమస్య తలెత్తుతోంది. అలాంటి సమస్య లేకుండా ఓ సైకిల్‌కు విద్యుత్తు బ్యాటరీ ద్వారా నడపడంతో పాటు ఆ సైకిల్ నడు స్తున్నంత సేపు బ్యాటరీ చార్జిచేసే విధంగా తయారు చేసిన సైకిల్ ఆకట్టుకుంది. ఈ సైకిల్‌ను భీమవరం విష్ణుపురానికి చెందిన శ్రీ సీతా పాలిటెక్నిక్ విద్యార్థులు రవిశంకర్, భవానీ ప్రసాద్‌లు ప్రదర్శించారు.



పరిశ్రమలకు ఉపయోగపడేలా విద్యార్థులను తయారు చేయాలి
కలెక్టర్ నాగరాణి

రాష్ట్రంలోని పరిశ్రమలకు అనుగుణంగా విద్యా ర్థులను తీర్చిదిద్దే విధంగా పాలిటెక్నిక్ కళాశా లలు ఉండాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. టెక్ ఫెస్టివల్‌ను ప్రారంభించారు. విద్యార్థులు కోర్సు పూర్తికాగానే ఇంజనీరింగ్‌కు మక్కువ చూపుతున్నారని ఉన్నత చదువుకోసం వెళ్లడం మంచిదేనని కానీ మన డిమాండ్‌కు తగ్గట్టుగా నడు చుకుంటే బాగుంటుందన్నారు.ఎక్కువ కంప్యూటర్ కోర్సులపై చూపే శ్రద్ధ మెకానికల్, సివిల్ విభాగాలకు ఉండటంలేదని ఆ శాఖల్లో నైపుణ్యం కలవారు తగ్గిపోతున్నా రన్నారు. వైజ్ఞానిక ప్రదర్శనలు తిలకించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఆర్డీవో కౌసర్‌బిన్, కమిషనర్ ఏసుబాబు, ఆర్జేడీ సత్య నారాయణ మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.



లలితాశ్రీ పీఠంలో దీపార్చన

కామవరపుకోట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : లక్ష్మీ హయగ్రీవ లలితాశ్రీ పీఠంలో మంగళవారం సామూహికంగా లక్ష్మీనారాయణ పూజ నిర్వహించి ఓంకార సహస్ర దీపార్చన నిర్వహించారు. స్వామివారికి, అమ్మవార్లకు భక్తులు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. పీఠం వ్యవస్థాపకుడు దుర్గబాబు, సత్య శ్రీనివాసాచార్యులు భక్తులతో పూజలు చేయించారు. మహిళలు అధిక సంఖ్యలో విచ్చేసి ఓంకారం, శంకుచక్రాల రూపంలో దీపాలను వెలిగించారు. భక్తి సంకీర్తనలు ఆలపించారు.



ఘనంగా లక్ష తమలపాకుల పూజ

జీలుగుమిల్లి, డిసెంబరు, 3 (ఆంధ్రజ్యోతి) : జీలుగుమిల్లి అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం లక్ష తమపాకుల పూజలు నిర్వహించారు. హన్‌మాన్ మండల దీక్ష చేపట్టిన స్వాములు పూజలు చేశారు. అర్చకులు కస్తూరి చిరంజీవిశర్మ స్వామి వారికి లక్ష తమలపాకులు పూజ చేశారు. స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు.

సౌత్‌జోన్ పోటీలకు స్వర్ణాంధ్ర విద్యార్థులు ఎంపిక



నరసాపురం రూరల్, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): త్వరలో చెన్నైలో జరిగే యూనివర్సిటీ సౌత్‌జోన్ టేబుల్ టెన్నిస్ పోటీలకు మండలంలోని స్వర్ణాంధ్ర విద్యార్థులు పాల్గొన్నారు. ఇటీవల జేఎన్‌టీయూ పరిధిలో కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వ హించిన టేబుల్ టెన్నిస్ పోటీల్లో కళాశాలకు చెందిన నలుగురు ఎంపికయ్యారు. వీరు చెన్నైలో జరిగే ఆల్ ఇండియా యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటారు. విద్యార్థులను మంగళవారం చైర్మన్ కేవీ సత్యనారాయణ, కోశాధికారి త్రినాధ్, డైరెక్టర్ శ్రీహరి, ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ గోపీచంద్, విశ్వనాథన్, పండరీనాథ్, పీడీ కొండలు అభినందించారు

మా ఊరికి దారేది..



పోలవరం గిరిజన గ్రామం మెత్తప్పకోట వాసుల ఆవేదన
రోడ్డు మార్గం లేక అవస్థలు
కొండలు..గుట్టలు దాటి ప్రయాణం
ట్రాక్టర్లపై వారపుసంతకు వచ్చి సరుకులు కొనుగోలు..

పోలవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) :

అది మారుమూల గిరిజన గ్రామం..పోలవరం మండల కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో పాపికొండల అభయారణ్యంలో ఉంది. నిత్యావసరాలు కొనుక్కోవాలన్నా, ప్రాణాల మీదకొచ్చి అత్యవసర పరిస్థితులు ఎదురైనా గర్భిణులు, బాలింతలు, పసిపిల్లలతో కొండకోనలు దాటి రాయి రప్పల్లో కిందా మీదా పడుతూ పోలవరం పరుగులెత్తాల్సిందే. ఒక్కో సందర్భాల్లో డోలీలు కట్టి లేదా మంచంతో సహా మోసుకొచ్చిన సందర్భాలు కూడా లేకపోలేదు. అదే మెత్తప్పకోట గ్రామం.. అభివృద్ధికి ఆమడ దూరంలో అడవుల్లో ఉంటూ ఇబ్బందుల పడుతున్న తమ గ్రామానికి ప్రతి ఎన్నికల్లో ప్రచారానికి ఓట్ల కోసం వచ్చిన నాయకులు రోడ్డు మార్గం వేయిస్తామని హామీ ఇచ్చి వెళ్ళారే గానీ ఒక్కరూ ఆచరణలో పెట్టడం లేదని గత ప్రభుత్వంలో వైసీపీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు సైతం రోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చి ఉత్తచెయ్యి చూపించారని ఆవేదన వ్యక్తం చేశారు. నేటికీ రోడ్డు మార్గంలేక అగచాట్లు పడుతూ ట్రాక్టర్‌పై ప్రయాణం చేస్తూ ప్రమాదాల బారిన పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలవరం మండలం చేగొండపల్లి పంచాయతీకి చెందిన ఈ గ్రామంలో 144 కుటుంబాలు ఉంటున్నాయి. ఏ అవసరం వచ్చినా బైకుమీదో ట్రాక్టర్‌పై రాళ్ళలో కొండలపైకి ఎక్కి దిగి పోలవరం చేరుకోవాల్సిందే. ప్రతి మంగళవారం పోలవరంలో జరిగే వారపు సంతకు ఉదయాన్నే ట్రాక్టర్లపై సమూహంగా వచ్చి నిత్యావసరాలు, మంచినీటితో సహా కొను గోలు చేసుకుని తిరిగి సాయంత్రానికి గ్రామం చేరుకుంటారు. అయితే ట్రాక్టర్‌పై రాకపోకలు సాగించే సందర్భంలో గతంలో 8 సార్లు ట్రాక్టరు తిరగబడి ప్రమాదాలు జరిగాయి. ఆ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిలో కొందరు మృత్యువు పాల య్యారని గ్రామస్థులు చెబుతున్నారు. 2016 సంవత్సరంలో ట్రాక్టర్ కొండల్లో తిరగబడి ఇదే గ్రామానికి చెందిన కొవ్వాసి రామయ్య అనే గిరిజనుడు మృతిచెందాడు. గతంలో అధికా రులు ఆ మార్గంలో రెండు కిలోమీటర్ల మేర రోడ్డు మార్గం పనులు తూతూ మంత్రంగా చేసి సొమ్ములు చేసుకున్నారే గానీ పూర్తిస్థాయిలో రోడ్డు మార్గం ఏర్పాటు చేయలేక పోయారని గ్రామస్థులు చెబుతున్నారు. చేగొండపల్లి పంచాయతీకి ఎలాంటి అవసరాల్లోనైనా ఈ గ్రామస్థులు వెళ్ళాలంటే 10 కిలోమీటర్లు కొండల్లో ప్రయాణించి వింజరం చేరుకుని అక్కడి నుంచి మరో 8 కిలోమీటర్లు పోలవరం చేరుకుని అక్కడి నుంచి బస్సుల్లో ఆటోల్లో మరో 15 కిలోమీటర్లు ప్రయాణం చేయవలసిన పరిస్థితి. విద్యార్థులైతే పోలవరం పరి సర గ్రామాల్లో ఇల్లు అద్దెకు తీసుకోవడం లేదా బంధువల ఇంట ఉండి చదవడం చేస్తుంటారు. దీనికి తోడు ప్రతి నెలా రేషన్ తీసుకోవాలన్నా, వింజరం ఆసుపత్రికి వెళ్ళాలన్నా, ఆ గ్రామం నుంచి రాకపోకలు సాగించడానికి 20 కిలో మీటర్లు కొండకోనల్లో ప్రయాణించాల్సిందే. అధికారులు,నాయకులు స్పందించి తమ గ్రామానికి రోడ్డు మార్గం ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రోడ్డు మార్గం వేయాలి



గ్రామస్థుడు మా గ్రామానికి రోడ్డు మార్గం కోసం ఎన్నో ప్రయత్నాలు చేశాం. గత ప్రభుత్వ పాలకుల నిర్వాకం వల్ల రోడ్డు మార్గం లేకుండా పోయింది. రోడ్డు కోసం నిధులు ఖర్చు చేశామని చెప్పుకుంటున్న నాయకులు రోడ్డు మార్గం ఎక్కడ వేశారో చెప్పలేకపోతున్నారు. అటవీశాఖ అధికారులు తమ గ్రామానికి రోడ్డు మార్గం విషయంలో అభ్యంతరాలు చెబుతున్నారు. మా గ్రామానికి రోడ్డు మార్గం వేయాలి.

మూలెం రాంబాబు, మెత్తప్పకోట

చాలా ఇబ్బందులు పడుతున్నాం



రోడ్డు మార్గం లేక పండించిన పంటలు తరలించడానికి, వైద్య సదుపాయాలు, నిత్యావసరాలు, మంచినీరు, ఇతర అవసరాలకు ఇబ్బం దులు పడుతున్నాం. చిన్న పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు వైద్య సదుపాయాలు కల్పించ డానికి రవాణా సౌకర్యం లేక ఇబ్బందులకు గురవు తున్నాం. రోడ్డు మార్గం ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించాలి.

మిడియం కన్నపరాజు, మెత్తప్పకోట

మాజీ మంత్రి ఆళ్ల నాని టీడీపీలో చేరే ముహూర్తం వాయిదా పడింది. ఏలూరు నియోజకవర్గంలో ఆయనకు వ్యతిరేకంగా ప్రకంపనలు చెలరేగడంతో టీడీపీ నాయకత్వం ఈ నిర్ణయం తీసుకుంది. తొలుత రాష్ట్ర మంత్రివర్గం సమావేశం పూర్తయిన తర్వాత మంగళవారం ముఖ్యమంత్రి, పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుతో ఆళ్ల నానితోపాటు మిగతా ఎమ్మెల్యేలు కలవాల్సి ఉంది. కొంత చర్చలు జరిగిన తరువాత నానిని నేరుగా పార్టీలో చేర్చుకుంటారా, లేదంటే కొంత గడువు ఇచ్చి భారీ బలగం మధ్య ఆయన ప్రవేశం ఉంటుందా అనే దానిపై తర్జనభర్జన జరిగింది.

ఆళ్ల నానీ.. ఆగండి

- సీఎంతో చర్చలు వాయిదా.. ఏలూరులో తీవ్ర వ్యతిరేకతే కారణం
- అందుబాటులోకి ఎంపీ మహేశ్, జిల్లా అధ్యక్షుడు గన్ని
- ఉండవల్లి వైపు చూడని సిట్టింగ్ ఎమ్మెల్యే చంటి.. 9కి వాయిదా



(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఆళ్ల నాని వ్యవహారంలో సోమవారం నుంచే ఒకింత గందరగోళం ఏర్పడింది. ఆయన టీడీపీలోకి రానున్నారని పార్టీ సంకేతాలు పంపగా, ఆ వెంటనే ఏలూరులో టీడీపీ కేడర్ సీరియస్‌గా స్పందించింది. గడిచిన ఐదేళ్ళల్లో పార్టీ నేతల ఆస్తులు ధ్వంసం, అక్రమ కేసుల నమోదు, వ్యక్తిగత దాడులను ప్రోత్సహించిన నానిని పార్టీలోకి చేర్చుకోవాల్సిన అవసరం ఏమొచ్చిందని తీవ్ర స్థాయిలోనే సీనియర్లంతా బహిరంగంగా వ్యాఖ్యలకు దిగారు. సిట్టింగ్ ఎమ్మెల్యే బడేటి చంటితోను ఈ అంశంపై మాట్లాడేందుకు ప్రయత్నించారు. పార్టీ కేడర్‌లో అత్యధికులు నాని రాకను వ్యతిరేకిస్తున్నందున తాము దానిని అంగీకరించాల్సి వస్తుందన్న అభిప్రాయాన్ని అధినాయకత్వం దృష్టికి తీసుకువెళ్లారు. ఈలోపే గడిచిన ఐదేళ్ళపాటు టీడీపీకి వ్యతిరేకంగా సాగిన దురాగతాలను సోషల్ మీడియాలో హోరెత్తించారు. తమను కాదని పార్టీలోకి వస్తే మీకు అవమానాలే అంటూ నాని నుద్దేశించి అనేకమంది కామెంట్లు పెట్టారు.

జిల్లాలో పార్టీ ఎమ్మెల్యేలతోపాటు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్‌తో సహా అందరూ మంగళవారం అందుబాటులో ఉండాలని సోమవారం రాత్రి స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో మంగళవారం పార్టీ ఆదేశాల మేరకు ఢిల్లీలో ఉన్న ఎంపీ మహేష్‌తోపాటు గన్ని ఉండవల్లికి చేరుకున్నారు. నియోజకవర్గంలో వెల్లువెత్తిన వ్యతిరేకతను ముందు అధినాయకత్వం దృష్టికి తీసుకురావాలని వీరు సంకల్పించారు.

ఎందుకింత వ్యతిరేకత ?

జగన్ పాలనలో మిగతా నియోజకవర్గాల మాదిరిగానే ఏలూరులో అనేక సంఘటనలు తెలుగుదేశంకు వ్యతిరేకంగా చోటు చేసుకున్నాయి. టీడీపీలో అత్యంత కీలకంగా వ్యవహరిస్తున్న నేతలను టార్గెట్‌గా చేసుకుని వారి వ్యాపార సముదాయాలను ధ్వంసం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా కట్టడాలు నిర్మించారనే సాకుతో కూల్చివేశారు. దీనిని అడ్డుకోవడానికి ప్రయత్నించిన వారిపైనా పోలీసులు బెదిరింపు ధోరణికి పాల్పడ్డారు. దీనికితోడు నాని వరుసగా ఎన్నికల్లో పోటీ చేయడం, ఆయన వెంటే కేడర్ కొనసాగుతుండడంతో ఆయన నిర్ణయమే ఏకపక్షమైంది. ఈ తరుణంలో గత ఎన్నికల్లో తనకు తిరుగులేదనుకున్న నానికి చేదు అనుభవం ఎదురైంది. భారీ ఓటమిని మూటకట్టుకున్నారు. నియోజకవర్గ ఓటర్లు అత్యధికులు ఆయన పట్ల వ్యతిరేకత ప్రదర్శించినట్లయ్యింది.

నేడు పార్టీ కార్యాలయానికి చంటి

పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించే వినతుల స్వీకరణలో పాల్గొనేందుకు సిట్టింగ్ ఎమ్మెల్యే చంటికి బుధవారం అవకాశం దక్కింది. ఇదే తరుణంలో సీఎం చంద్రబాబు వినతుల స్వీకరణలో పాలుపంచుకోబోతున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, సీఎం మధ్య కొంత సంభాషణ జరిగినా ఆశ్చర్యపోనక్కర్లేదని భావిస్తున్నారు. ఎమ్మెల్యే కూడా ఉన్న పరిస్థితులను ఆయనకు వివరించనున్నారు. ఈ నెల 9న ఆళ్ల నాని రాకకు దాదాపు ముహూర్తం ఖరారు చేయడంతో ఈ పరిణామాలు ఎలా ఎదుర్కోవాలని నియోజకవర్గంలో టీడీపీ నేతలంతా తర్జనభర్జనలు పడుతున్నారు.

ఎమ్మెల్యే ఏం చేయబోతున్నారు ?

తాజా పరిణామాల నేపథ్యంలో ఎమ్మెల్యే బడేటి చంటి నిర్ణయాన్ని పార్టీ నాయకత్వం పరిశీలనలోకి తీసుకోబోతుంది. ఈ నెల 9న నాని పార్టీలో చేరే విషయంలో నిర్దిష్ట అభిప్రాయానికి రానున్నారు. ఈలోపే నియోజకవర్గంలో చెలరేగిన అసంతృప్తిని ఏ రూపంలో పార్టీ అంచనా వేస్తుందనేది అందరి ప్రశ్న. ఈ తరుణంలోనే ఎమ్మెల్యేపై పార్టీ కేడరంతా పూర్తి బాధ్యతలను అప్పగించింది. మేమైతే నానిని పార్టీలోకి తీసుకుంటే బాగుండదని చెబుతున్నాం. వైసీపీ హయాంలో నష్టకష్టాలను అనుభవించాం. మళ్లీ వాళ్ళనే పార్టీలోకి తీసుకోవాలా, వద్దా అనే తుది నిర్ణయానికి రండి అంటూ ఎమ్మెల్యేపై ఒత్తిడి పెంచారు. దీంతో మంగళవారం పార్టీ నుంచి పిలుపు వచ్చినా చంటి ఆ వైపు చూడనేలేదు. ఏదైనా నిర్ణయం తీసుకుంటే మీ ఇష్టం, ఇక్కడ అత్యధికులు నాని రాకను వ్యతిరేకిస్తున్నారని ఎమ్మెల్యే పార్టీకి చేరవేశారు. దీంతో మంత్రివర్గ సమావేశం పూర్తయిన వెంటనే పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్యులతో సీఎం చంద్రబాబు భేటీ కావాలనుకున్నా ఆఖరు నిమిషంలో వాయిదా వేసుకున్నారు. ఏలూరు ఎమ్మెల్యే వచ్చారా, రాలేదా అని టీడీపీ పెద్దలు ఆరా తీశారు. అప్పటికే ఎంపీ మహేష్‌యాదవ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు గన్ని మాత్రమే అందుబాటులోకి వచ్చారనే విషయం పార్టీకి చేరింది. అయినప్పటికీ స్థానిక ఎమ్మెల్యే రాకుంటే ఇక మాట్లాడేదెలా అంటూ ఈ నెల 9న తేలుద్దామని ప్రస్తుత భేటీని వాయిదా వేసుకున్నారు. నాని పార్టీలో చేరే వ్యవహారం మంగళవారం తేలిపోతుందని భావించినా దీనికి విరుద్ధమైన పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఒకప్పుడు ఉప ముఖ్యమంత్రిగా వ్యవహరించిన ఆళ్ల నాని స్థానికంగా అంత బలవంతుడైతే తమకు ఎవరికీ అభ్యంతరంలేదని, కేవలం అవకాశం కోసమే పార్టీలోకి వస్తున్నారనే అభిప్రాయాన్ని నియోజకవర్గమంతటా వినిపించింది. ఈ విషయంలో ఉండవల్లికి రావాల్సిందిగా ఎమ్మెల్యే చంటిని పదేపదే కోరినా ఫలితం లేకపోయింది.



అవినీతికి పాల్పడితే జైలే

- ఉపాధి విజిలెన్సు విభాగానికి జవసత్వాలు
- జీవో 52 మరింత కఠినం

'ఉపాధి'లో అక్రమాలకు చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం జీవో నంబర్ 52కు పదును పెట్టాలని నిర్ణయించింది. ఈ పథకంలో అక్రమాలు నిరోధించే విజిలెన్సు విభాగాన్ని గత వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. అయితే ఆ విభాగాన్ని పటిష్ఠం చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్టేట్ విజిలెన్స్ ఆఫీసర్‌గా వివిధ విభాగాలకు చెందిన ఆఫీసర్లను కాకుండా పోలీసు అధికారులను నియమించడంతో ఈ పథకం ద్వారా జేబులు నింపుకుంటున్న నేతల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

అత్తిలి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కొత్తగా విజిలెన్సు విభాగం అధికారిగా బాధ్యతలు తీసుకున్న చీఫ్ విజిలెన్సు అధికారి భవానీ హర్ష విజిలెన్స్ విభాగం అసలు లక్ష్యాలను సాధించేందుకు ఆయన జిల్లాలోని 'ఉపాధి'లో జరుగుతున్న పనుల వివరాలపై నివేదిక అందించాలని ఉత్తర్వులు జారీ చేసినట్టు సమాచారం. ఉపాధి పనులపై ఇప్పటి వరకు సోషల్ ఆడిట్ విభాగం తనిఖీలు చేసి రికవరీ చేసే అతి స్వల్ప పాత్రను పోషిస్తోంది. అయితే విజిలెన్స్ విభాగం సోషల్ ఆడిట్‌ను ఆషామాషీగా తీసుకోకుండా దుర్వినియోగం అయిన ప్రతి రూపాయిని అక్రమార్కుల నుంచి వసూలు చేసేందుకు విజిలెన్సు విభాగం ముందుకు వెళ్ళే అవకాశం ఉంది. జీవో నంబర్ 52 ప్రకారం ఉపాధి పథకంలో లక్ష కంటే ఎక్కువ మొత్తంలో అవినీతికి పాల్పడినట్లు సోషల్ ఆడిట్‌లో నిర్ధారణ అయితే విచారణ చేయాలని డ్వామా అధికార వర్గాలు తెలిపాయి. ఆ జీవోను ఇప్పటి వరకూ తూతూ మంత్రంగా అమలు చేశారు. కొత్త చీఫ్ విజిలెన్సు అధికారి ఈ జీవోలోని నిబంధనలపై దృష్టి పెట్టినట్లు జిల్లా అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకూ ఆయా జిల్లాల్లో ఎంత మంది లక్ష కంటే ఎక్కువగా అవినీతికి పాల్పడినట్లు సోషల్ ఆడిట్ అధికారులు నిర్ధారించారో తెలుసుకుని వారిపై కేసులు నమోదు చేశారా, చేయకపోతే ఎందుకు చేయలేదు అనే వివరాలను అందించాలని ఆదేశించినట్లు సమాచారం. దీంతోపాటు అక్రమాలకు పాల్పడిన వారిపై ఆధార్ యాక్టు ఎన్ని చోట్ల వినియోగించారు? పరారీలో ఉన్న అక్రమార్కుల వివరాలు.. అక్రమాలకు పాల్పడడంతో తొలగించిన సిబ్బంది వివరాలను పంపించాలని కోరినట్లు తెలిసింది. దీంతో తప్పు చేసిన వారి గుండెల్లో రైళ్ళు పరిగెడుతున్నాయి. ఆడిట్‌లో తేలిన తప్పులపై మూడు రోజుల్లోపు చర్యలు తీసుకోవాలని జీవో నంబర్ 52లో స్పష్టంగా పేర్కొంది. ఈ నేపథ్యంలో విజిలెన్స్ ప్రొసీడింగ్ తప్పనిసరిగా అమలు చేసేందుకు జిల్లా అధికారులు సమాయత్తమవుతున్నారు. విజిలెన్స్ విభాగాన్ని కఠినతరం చేస్తే ఇకపై ఉపాధి హామీ పథకంలో అవినీతికి పాల్పడిన వారు జైలుకు వెళ్ళక తప్పదేమోనన్న భయం ఆ విభాగంలో పని చేస్తున్న వారిలో కనిపిస్తోంది.

పరిశోధనలు పేటెంట్ల స్థాయికి ఎదగాలి



శ్రీనివాస్ మద్దిపాటి

తాడేపల్లిగూడెం అర్బన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సమాజానికి ఉపయోగపడేలా నాణ్యమైన ప్రాజెక్టులు చేపట్టాలని ఇవా ఐపీ అండ్ ఐటీ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్ మద్దిపాటి అన్నారు. ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎన్‌వీ రమణారావు, రిజిస్ట్రార్ డాక్టర్ పి. దినేష్‌శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇనిస్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ సహకారంతో మేధోసంపత్తి హక్కులు-ఆవిష్కరణల పేటెంట్ అనే అంశంపై మంగళవారం ఏపీ నిట్‌లో విద్యార్థులకు ఆన్‌లైన్‌లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఆవిష్కర్త కేవలం పరిశోధనా పత్రాలకే పరిమితం కాకుండా తమ పరిశోధనలు పేటెంట్‌లుగా మలుచుకునే స్థాయికి ఎదగాలని సూచించారు. పేటెంట్ అనేది ప్రభుత్వం అధికారికంగా మంజూరు చేసే హక్కు అని, ఆవిష్కర్తలు తమ పరిశోధనలో ఏదో ఒక కొత్త విషయాన్ని చెప్పడంతో పాటు సంబంధిత రంగంలో ఏ విధంగా ఉపయోగపడుతుందో ఆధారాలతో సహా రూపించాలన్నారు. ఇనిస్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ అధ్యక్షుడు, ఆచార్యులు డాక్టర్ పెద్దపాటి శంకర్, ఉపాధ్యక్షురాలు డాక్టర్ వి.సుదర్శన దీప మాట్లాడారు. డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జీఆర్‌కే శాస్త్రి అధ్యక్షత వహించగా ఆచార్యులు డాక్టర్ ఫణికృష్ణ కర్రి, డాక్టర్ కార్తికేయ శర్మ కో-ఆర్డినేటర్లుగా వ్యవహరించారు.

సంక్రాంతికి ముందే సై

సంక్రాంతి పండుగ ఇంకా 40 రోజులు ఉండగానే జిల్లాలో జూదాల జాతర మొదలైంది. పేకాట, కోడి పందాలతో పందెంరాయుళ్ళు మంచి జోష్ మీద ఉన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో పేకాట, కోడిపందాలు జోరుగా సాగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. కొందరు రాజకీయ నాయకుల అండదండలతో రాత్రివేళల్లో ఫ్లడ్ లైట్ల వెల్తురులో కాంతుల్లో భారీగా పందేలు సాగుతున్నాయి. దీంతో లక్షలు చేతులు మారుతున్నాయి.



- జిల్లాలో జూదాల జాతర
- రోజుకో మండలాన్ని మారుస్తూ
- లక్షల్లో జూదాలు
- చోద్యం చూస్తున్న పోలీసులు

భీమవరం క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కొందరు దూర ప్రాంతాల నుంచి వచ్చి నాయకుల అనుమతితో జూదం నిర్వహిస్తున్నట్లుగా సమాచారం. అలాగే అధికారులు కూడా అటువైపు కన్నెత్తి చూడకుండా ఉండేందుకు భారీ ముడుపులు ఇచ్చి ఇలా జూదాలు నిర్వహిస్తున్నట్టు చెబుతున్నారు. జిల్లా కేంద్రమైన భీమవరం చుట్టుపక్కల ప్రాంతమైన ఒక గ్రామ పరిధిలో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో రాత్రి 11 గంటల సమయంలో వందల్లో కార్లు, ద్విచక్ర వాహనాలు అక్కడకు చేరుకున్నాయి. ఫ్లడ్ లైట్లు కూడా రెడీ చేశారు. అయితే ఒక పోలీసు అధికారి నిలుపుదల చేయాలంటూ ఆదేశాలు ఇవ్వడంతో కోడిపందేలు నిలిపివేశారు. అయితే ఆ సమయంలో ఆ గ్రామ పరిధి అంతా వాహనాలతో నిండిపోయింది. గ్రామ ప్రజలకు ఏం జరుగుతుందో అర్థం కాలేదు. అలాగే భీమవరం మండలంలోని ఒక గ్రామంలోని విల్లాస్‌లో నిత్యం పేకాట జరుగుతోందనే ప్రచారం జరుగుతోంది. పోలీసులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో అనేక వదంతులు వినిపిస్తున్నాయి.

వేరే ప్రాంతం నుంచి నిర్వాహకుడి రాక?

జిల్లాలోని కాళ్ళ మండల పరిధికి చెందిన ఒక వ్యక్తి కొన్నేళ్ళ క్రితం విశాఖ వెళ్ళి స్థిరపడ్డాడు. ఆ వ్యక్తి జిల్లాకు వచ్చి జూదాల నిర్వహణకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు సమాచారం. ఒక్కొక్కసారి ఒక్కో మండల పరిధిని ఎంచుకుని జూదగాళ్ళకు సమాచారం ఇవ్వడం, రెండు గంటల ముందుగానే సమాచారం అందుకున్న జూదగాళ్ళు అక్కడికి చేరిపోతున్నారు. దీంతో రాత్రి 3 గంటల వరకు జూదం నిర్వహించడం సర్వసాధారణమైపోయింది. అయితే ఆ వ్యక్తి కొందరు పోలీసు అధికారులకు భారీగా ముడుపులు అప్పచెప్పడం వల్లే పోలీసులు పెద్దగా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. ఏది ఏమైనా జూదానికి 'పశ్చిమ' పేరుగాంచింది అన్న విషయం మళ్ళీ రుజువవుతోంది.

కోడిపందేల శిబిరంపై దాడి 20 మంది అరెస్టు

కొయ్యలగూడెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోడి పందేల శిబిరంపై దాడి చేసి 20 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం మండలంలోని గవరవరం గ్రామంలో సోమవారం రాత్రి కోడి పందేలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో దాడి చేశామన్నారు. ఈ దాడిలో రూ. లక్షా 23,130 నగదు, ఐదు మోటర్ సైకిళ్ళు, రెండు కోడిపుంజులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మండలంలో ఎవరైన ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎస్ఐ హెచ్చరించారు.

కత్తితో దాడి..

టి.నరసాపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిపై కత్తితో దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో నిందితుడు గుమ్మళ్ళ స్వామిపై కేసు నమోదు అరెస్టు చేసినట్లు ఎస్సై ఎం. జయబాబు మంగళవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మండలం లోని రాజుపోతేపల్లి గ్రామానికి చెందిన నత్తా నాగరాజుకు, అదే గ్రామానికి చెందిన గుమ్మళ్ళ స్వామికి గత కొంతకాలంగా ఇంటి స్థలం విషయంలో వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో ఈ నెల రెండున నాగరాజు స్థానిక సచివాలయం వద్దకు వెళ్ళి తిరిగి ఇంటికి వెళ్తుండగా గుమ్మళ్ళ స్వామి ఇంటి సమీపంలోకి వచ్చేసరికి నాగరాజును స్వామి బూతులు తిడుతూ నా యింటి దగ్గర చేతబడి చేయిస్తావా అంటూ తన వద్ద ఉన్న కత్తితో నాగరాజు తలపై దాడి చేశాడని ఇంతలో నిందితుడి తమ్ముడి కొడుకు అడ్డుపడి కత్తి లాక్కున్నాడని తెలిపారు. బాధితుడు నాగరాజు తలకు బలమైన గాయం కావడంతో అతని బంధువులు చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి భార్య నత్తా సుజానమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడు గుమ్మళ్ళ స్వామిని అరెస్టు చేసి రిమాండు నిమిత్తం కోర్టులో హాజరుపరచామని ఎస్సై తెలిపారు.

వాహన తనిఖీలు

రూ. 1.49 కోట్ల జరిమానా

ఏలూరు క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా రవాణా శాఖ అధికారులు నవంబరు నెలలో జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి 3,319 వాహనాలపై కేసులు నమోదు చేసి కోటి 49 లక్షల రూపాయలను అపరాధ రుసుముగా విధించినట్లు జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీమ్ ఒక ప్రకటనలో తెలిపారు. వీటిలో ప్రత్యేకించి 943 హెల్మెట్ ధరించని కేసులని, లైసెన్సులేని 529 మందిపై కేసులు నమోదు చేశామన్నారు.



మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

వైసీపీ ఇన్‌చార్జి కొట్టును మార్చకుంటే పార్టీకి రాం రాం

తాడేపల్లిగూడెం రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి):తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ కొట్టు సత్యనారాయణను మార్చకపోతే తాము పార్టీకి రాజీనామా చేసేందుకు వెనుకాడబోమని ఆ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు స్పష్టం చేశారు. తాడేపల్లిగూడెంలోని ఓ హోటల్‌లో మంగళవారం సమావేశమయ్యారు. తాడేపల్లిగూడెం, పెంటపాడు జడ్పీటీసీలు ముత్యాల ఆంజనేయులు, ఉప్పులూరి వరలక్ష్మి, ఎంపీపీ పి.శేషులత, పట్టణ అధ్యక్షుడు గుండుబోగుల నాగు నాయకత్వం వహించారు. నాయకులు మాట్లాడుతూ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పార్టీ కోసం పనిచేసిన తమను వేధించారని, అయినా పార్టీ కోసం పనిచేశామని చివరికి గుర్తింపు లేకుండా మాజీ మంత్రి వ్యవహరించారని ఆరోపించారు. తాడేపల్లిగూడెంలో నాయకత్వ మార్పు చేస్తే తాము పార్టీలో కొనసాగుతామని లేదంటే పార్టీని వీడటానికి వెనకాడమని హెచ్చరించారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, వార్డు ఇన్‌చార్జ్‌లు, ముఖ్య నాయకులు ధిక్కార స్వరం వినిపించారు.

రైల్లోంచి తోసేశారు !

మాజీ సర్పంచ్‌పై దొంగల దాడి



నరసాపురం రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నరసాపురం మండలం సీతారాంపురం మాజీ సర్పంచ్ అడబాల అయ్యప్ప నాయుడుపై రైలులో దొంగలు దాడిచేశారు. వెళుతున్న రైల్లోంచి తోసివేశారు. తీవ్రంగా గాయపడిన ఆయన రైల్వే పోలీసుల సాయంతో ప్రాణాలతో బయటపడ్డారు. నాయుడు తెలిపిన వివరాలివి.. శుక్రవారం హైదరాబాద్ నుంచి నరసాపురానికి నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరారు. టాయిలెట్‌కు వెళ్లేందుకు బోగీలోంచి బయటకు రాగా.. ఆ సమయంలో రైలు స్లో అయింది. ఇద్దరు వ్యక్తులు లోపలికి రావడాన్ని గుర్తించి బోగీలోకి ఎందుకు వెళుతున్నారని ప్రశ్నించా. వారు సమాధానం చెప్పకుండా తలుపు తీసి కదులుతున్న రైల్లోంచి నన్ను బయటకు నెట్టేశారు. తీవ్రంగా గాయపడి పట్టాల పక్కన పడ్డా. మరో రైలు వస్తుండటంతో ప్రమాదాన్ని గుర్తించి పక్కకు జరిగా. రైల్వే పోలీసులు వచ్చి ఖమ్మం ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. అక్కడ కోలుకుని మంగళవారం గాయాలతో స్వగ్రామం చేరుకున్నా. ఆ ఘటన తలుచుకుంటే ఇంకా భయంగా ఉంది. ప్రాణాలతో బయటపడతానని అనుకోలేదని తనను పలకరించేందుకు వస్తున్న స్నేహితుల వద్ద కన్నీటి పర్యంతమయ్యారు.



దారి దోపిడీ కేసులో ముగ్గురి అరెస్టు

నరసాపురం రూరల్, డిసెంబరు 3 (ఆన్‌లైన్): మండలంలోని సీతారాంపురం చెక్‌పోస్టు వద్ద ఈ ఏడాది ఆగస్టులో దారి దోపిడీకి పాల్పడిన ముగ్గుర్ని మొగల్తూరు పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం నరసాపురం రూరల్ సర్కిల్ కార్యాలయంలో సీఐ దుర్గా ప్రసాద్ విలేకర్లకు వివరాలు వెల్లడించారు. మొగల్తూరు మండలానికి చెందిన ఎం. దుర్గారావు బైక్‌పై పాలకొల్లు వెళుతూ సీతారాంపురం చెక్‌పోస్టు వద్ద ఆగాడు. ఆ సమయంలో అక్కడ నక్కి ఉన్న కేసవరపు వీర వెంకట సత్య విఘ్నేష్, రాయుడు రాజు, తలపల అశోక్ అలియాస్ నిత్య రోజీ (ట్రాన్స్ జెండర్) దుర్గారావుపై దాడి చేసి అతని వద్ద ఉన్న రూ. 22 వేలు నగదు, ఒక సెల్‌ఫోన్ లాక్కొని పారిపోగా బాధితుడు మొగల్తూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం అప్పటి నుంచి గాలిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో నిందితులు మొగల్తూరు వెళ్లే దారిలోని రాజుగారితోట వద్ద ఉన్నారన్న పక్కా సమాచారంతో ఎస్సైలు జి. వాసు, వై. నాగలక్ష్మి సిబ్బందితో వెళ్లి నిందితుల్ని అరెస్టు చేసి వారి నుంచి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని, నేరానికి ఉపయోగించిన బైక్‌ను సీజ్ చేశామని సీఐ తెలిపారు. నిందితులు ముగ్గురూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన వారిగా విచారణలో తేలిందన్నారు. ఎస్సైలు జి. వాసు, వై. నాగలక్ష్మి, ఏఎస్సై సీహెచ్ సత్యనారాయణ, కానిస్టేబుళ్లు రాజేష్, బేబి పాల్గొన్నారు.

ప్రియుడి ఇంటి ముందు ధర్నా

ఏలూరు క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏలూరు నగరానికి చెందిన ఒక యువతి (24)ని ఏలూరు సత్యనారాయణపేటకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి షేక్ షాజహాన్ (29) పరిచయం పెంచుకుని ప్రేమిస్తున్నానని పెళ్ళి చేసుకుంటానని నమ్మ బలికాడు. ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా శారీరక సంబంధం కొనసాగించాడు. అయితే మరో యువతిని పెళ్ళి చేసుకోవడానికి సిద్ధపడడంతో అది తెలుసుకున్న బాధితురాలు మంగళవారం ప్రియుడి ఇంటి ముందు ధర్నా చేపట్టింది. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ జి. సత్యనారాయణ, ఎస్ఐ మదీనా బాషా సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్ళి బాధితురాలి నుంచి వివరాలు తెలుసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వేధింపుల భర్తకు ఏడాది జైలు

ఏలూరు క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏలూరు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రెడ్డి చంద్రప్రియకు సాయి సత్య రాఘవేంద్రరావుతో వివాహం జరిగింది. వివాహ సమయంలో ఇచ్చిన కట్నం చాలలేదని అదనపు కట్నం తీసుకురావాలని చంద్రప్రియను భర్త రాఘవేంద్రరావు శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేశాడు. దీంతో బాధితురాలు 2022 మార్చి 11న ఏలూరు త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అప్పటి ఏఎస్ఐ కె గోవిందరాజు కేసు నమోదు చేయగా అప్పటి ఎస్ఐ శంకర్ కేసు దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ఈ కేసు స్పెషల్ జ్యుడిషియల్ మొబైల్ కోర్టులో విచారణ సాగింది. నిందితుడైన రాఘవేంద్రరావుపై నేరం రుజువు కావడంతో ఏడాది జైలు శిక్ష, ఐదు వేల రూపాయల జరిమానా విధిస్తూ మేజిస్ట్రేట్ ఎండి అబుతాలీబ్ పర్వేజ్ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ పి. హేమలత వాదించగా ప్రాసిక్యూషన్‌కు ఎస్ కోటేశ్వరరావు, కోర్టు కానిస్టేబుళ్ళు సహకరించారు.

ఉరి వేసుకుని ఒకరి ఆత్మహత్య

కలిదిండి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పేట కలిదిండి దేవుడు తోటలో నివాసం ఉంటున్న బోయిన రమేష్ (40) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్యతో విడిపోయిన రమేష్ ఒంటరిగా ఉంటున్నాడు. మంగళవారం ఉదయం తల్లి ఇంట్లోకి వెళ్లేసరికి రమేష్ ఫ్యాన్‌కి ఉరివేసుకుని చనిపోయి ఉన్నాడు. తండ్రి చిన్న వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

క్రైమ్ కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

పెనుగొండ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మోటారు సైక్లిస్టును కారు ఢీకొనడంతో అతను అక్కడికక్కడే మృతి చెందినట్టు ఎస్ఐ కె. గంగాధరరావు తెలిపారు. పాలకొల్లు మండలం దగ్గులూరుకు చెందిన దొడ్డి నాగరాజు (34) రాజమండ్రిలోని ఒక రైస్ మిల్లులో లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. దగ్గులూరు నుంచి డ్యూటీకి వెళ్లే సమయంలో పెనుగొండ-మార్టేరు రోడ్డులో శ్రీ వాసవి ఫ్లయాష్ బ్రిక్స్ వద్ద ఎదురుగా పెనుగొండ నుంచి మార్టేరు వైపు వెళుతున్న కారు నాగరాజు మోటారు సైకిల్‌ను ఢీ కొట్టడంతో నాగరాజు అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. నాగరాజు భార్య దేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతానికి రైతు బలి

ఆకివీడు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):పశువులకు గడ్డి కోయడానికి వెళ్ళి విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. కుప్పనపూడి శివారు శివదేవ పార్వతీపురానికి చెందిన మధుం వెంకటేశ్వరరావు(45) అనే రైతు పశువులకు గడ్డి కోయడానికి మంగళవారం పొలం వెళ్ళాడు. గడ్డి కోస్తుండగా కరంటు వైర్లు తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే చనిపోయాడు. మృతుడి భార్య నాగ ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు హనుమంతు నాగరాజు ఎస్ఐ కేసు నమోదు చేశారు.

మరో ఘటనలో...

ఏలూరు క్రైం: చెరువు గట్టుపై కాపలాగా ఉన్న ఒక వ్యక్తి ఇంట్లో ఫ్యాను వైర్లను బిగిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ సరఫరా జరిగి షాక్‌కు గురై మృతి చెందాడు. ఏలూరు రూరల్ మండలం శ్రీపర్రుకు చెందిన జయమంగళ మంగరాజు(29) అదే గ్రామంలోని ఒక రైతు చేపల చెరువుకు కాపలాగా ఉంటూ చెరువుగట్టుపై తన కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. మంగళవారం ఉదయం ఇంట్లో ఫ్యానుకు విద్యుత్ వైరు ఊడడంతో దానిని బిగిస్తున్నాడు. అయితే ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు రూరల్ ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

మృతుడి గుర్తింపు

ఏలూరు క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏలూరు రూరల్ మండలం కొమడవోలు శివారు ఇందిరమ్మ కాలనీ సమీపాన వరి చేలో గుర్తు తెలియని వ్యక్తి మృత దేహాన్ని ఏలూరు రూరల్ పోలీసులు ఈ నెల 2వ తేదీన కనుగొన్నారు. పత్రికల్లో సమాచారం రావడంతో బంధువులు మృతుడిని గుర్తించారు. పెదపాడు మండలం సత్యవోలు పంచాయతీ సకల కొత్తపల్లి గ్రామానికి చెందిన ఆబోతుల సూరిబాబు (40)కు భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉండగా గతంలో కైకలూరులో ఉండేవారు. కుటుంబ కలహాల నేపథ్యంలో సూరిబాబు ఏడాది క్రితం సకలకొత్తపల్లిలో తన తల్లిదండ్రుల వద్దకు వచ్చి ఉంటున్నాడు. అతని భార్య పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్ళిపోయింది. సూరిబాబుకు మానసిక స్థితి సరిగా లేనందున వైద్యులకు చూపించగా మెరుగైన చికిత్స నిమిత్తం మానసిక వైద్య నిపుణుల వద్దకు వెళ్ళాలని సూచించారు. గత నెల 24న సూరిబాబు సోదరి అతనిని వైద్యులకు చూపించి బ్యాంకు పని ఉండగా మార్గమధ్యంలో ఆగారు. అతను అక్కడ నుంచి వెళ్ళిపోయి తిరిగి రాలేదు. మానసిక స్థితి సరిగా లేక ఆహారం తినక నీరసించి వరిచేలో పడిపోయి ఉంటాడని ప్రాథమికంగా భావించారు. మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మబ్బు తెర వీడింది

» ధాన్యంపై పట్టా తొలగింది » గట్టెక్కిన తుపాను గండం » ఊపిరిపీల్చుకుంటున్న రైతులు



ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

పెదవేగి, డిసెంబర్ 3(ఆంధ్రజ్యోతి) : ఫెంగల్ తుపాను గండం గడిచింది. మబ్బు తెర వీడింది. చినుకు రాక ఆగింది. ధాన్యం రాశులపై పట్టాల తెర తొలగింది. వర్ష ప్రభావం నుంచి ధాన్యానికి రక్షణ కలగడంతో రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు. పెదవేగి మండలంలో 6 వేల ఎకరాల్లో వరి సాగు జరిగింది. దాదాపు 16,800 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా కాగా, 1,860 ఎకరాల్లో వరి మాసూళ్లు జరిగాయి. నాలుగు వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి, మిల్లులకు తరలించారు. కోత కోసి రైతుల వద్దే మరో 600 మెట్రిక్ టన్నులు ధాన్యం నిల్వ ఉంది. వర్షాలు కారణంగా ధాన్యం సేకరణ కు వీల్లేకుండా ఉండడంతో ఆ ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులు వారం రోజుల పాటు అష్టకష్టాలు పడ్డారు. టార్పాలిన్ కప్పి, ధాన్యాన్ని కాపాడుకుంటూ వచ్చారు. తుపాను ముప్పు తప్పడంతో ధాన్యం రాశులపై కప్పి ఉంచిన పట్టాలను తొలగించి, ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. తగినంత తేమ శాతం వచ్చేవరకు ఆరబెట్టి విక్రయిస్తామని రైతులు చెబుతున్నారు. ఇదికాక ఇంకో 250 మెట్రిక్ టన్నులు కుప్పలు వేయగా, 150 మెట్రిక్ టన్నులు కోత కోసి పనలపై ఉంది. ఫెంగల్ తుపాను కారణంగా వరి పనలు కొంతమేర తడిశాయి. కోత కోసిన ధాన్యాన్ని ఆరబెట్టడానికి అనువుగా కల్లాలు లేకపోవడంతో రహదారులే కల్లాలుగా మారాయి. భోగాపురం, అమ్మపాలెం, పెదకడిమి, కొప్పాక, దుగ్గిరాల, పినకడిమి తదితర గ్రామాల్లో రహదారులపై ధాన్యాన్ని ఆరబెట్టి, ఆపై విక్రయిస్తున్నారు. వంగూరులో సుమారు 20 మంది రైతులు ఒకేచోట ధాన్యం రాశులు పోసి, పట్టాలు కప్పి వర్షంనుంచి ధాన్యాన్ని కాపాడుకున్నారు. తుపాన్లు రాకపోతే మరో పది రోజుల్లో ధాన్యం మాసూళ్ళు పూర్తవుతాయని, అప్పటి వరకు ఈ పోరాటాలు తప్పవని రైతులు అంటున్నారు. రహదారులపై నిల్వ చేసిన ధాన్యం రాశుల కాపలా కోసం రాత్రి సమయంలో చలిగాలిలో కూడా అక్కడే ఉండాల్సి వస్తుందని రైతులు తెలిపారు. అదే తుపాను లేకపోతే కోతకోసిన రెండు, మూడు రోజుల్లో ధాన్యాన్ని మిల్లులకు తరలించే వారమని, ఇప్పుడు ధాన్యాన్ని పోగేస్తూ, తిరిగి ఆరబెడుతుడడంతో అదనపు భారం పడుతోందని వాపోతున్నారు.

తేమ శాతం 25 ఉన్నా కొనుగోలు చేస్తాం

ఉంగుటూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏ రైతు అధైర్య పడవద్దని తేమ శాతం 25 ఉన్నా ధాన్యం కొనుగోలు చేస్తామని జిల్లా పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ వి.శ్రీలక్ష్మీ పేర్కొన్నారు. ఉంగుటూరులో మంగళవారం ఆమె పర్యటించి ధాన్యం కొనుగోలుపై సమీక్షించారు. ఇప్పటివరకు జిల్లాలో 367.63 కోట్ల విలువైన లక్షా 59 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 20, 959 మంది రైతుల నుంచి కొనుగోలు చేశామన్నారు. రైతు కోరిన రైస్ మిల్లుకే ధాన్యం తోలుకొనే సౌకర్యం కల్పించామని, ధాన్యం తోలిన 48 గంటలలో నగదు జమ చేశామన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను మానిటరింగ్ చేయడానికి 088012-230448, 7702003584 నెంబర్లతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు.

విలేకరిపై దాడి.. జనసేనకు సంబంధం లేదు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలరాజు

జీలుగుమిల్లి, డిసెంబరు 3 : (ఆంధ్రజ్యోతి) : విలేకరిపై దాడి చేసిన వారిని శిక్షించేలా చర్యలు తీసుకుంటామని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. జీలుగుమిల్లిలో జనసేన పార్టీ కార్యాలయం వద్ద కూటమి నాయకులు సీహెచ్. ప్రసాద్, పి.రాము, సీహెచ్.శ్రీను ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. కొయ్యలగూడెంలో ఓ విలేక రిపై జరిగిన దాడిని జనసేన కార్యకర్తలకు సంబంధం లేదన్నారు. పార్టీ కార్యకర్తలు కారం చల్లినట్లు కొన్ని చానల్‌లో ప్రచారం జరగడాన్ని ఎమ్మెల్యే బాలరాజు ఖండించారు. తమపై కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. కొయ్యలగూడెంలో జరిగిన ఘటనపై పోలీస్‌లతో చర్చించామన్నారు. విచారణ జరుగుతుందని తమ పార్టీ వారైనా సహించేది లేదని చర్యలు తీసుకుంటామన్నారు.

● కొయ్యలగూడెం : విలేకరిపై దాడికి జనసేన కూటమికి సంబంధంలేదని మండల జనసేన అధ్యక్షుడు టి.రవి అన్నారు. పట్టణ జనసేన అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ ఇంటి వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోమవారం సాయంత్రం కొయ్యలగూడెంలో ఒక విలేఖరి పై దాడి జరిగిందని ఆ దాడి పోలవరం ఎమ్మెల్యే అనుచరులు చేసినట్లుగా ఒక ఛానల్‌లో వచ్చిందని దీనికి జనసేన పార్టీకి ఏవిధమైన సంబంధంలేదన్నారు. నాయకులు సీహెచ్.మధు, ఎం.శ్రీను, ఎస్.బాబి తదితరులు పాల్గొన్నారు.

ఇండియా ఇంటర్నేషనల్ ఫెస్టివల్‌కు జాన్ మాస్టార్

ఉంగుటూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కైకరం జెడ్పీ హైస్కూలు ఫిజిక్స్ టీచర్ కునాతి జాన్ ఇండియా ఇంటర్నేషనల్ సైన్సు ఫెస్టివల్ 2024కు ఎంపికయ్యారు. నవంబరు 30 నుంచి డిసెంబరు 3 వరకు అసోం రాష్ట్రం గౌహతి ఐఐటీ క్యాంపస్‌లో జరిగిన ఐఐఎస్ఎఫ్ 10వ ఎడిషన్‌లో ఈయన గురుకులం జౌత్సాహిక అధ్యాపకులు, ఉపాధ్యాయుల వర్క్ షాపు విభాగంలో పాల్గొన్నారు. వర్క్‌షాపు అనంతరం జాన్ మాస్టారు సీఎస్ఐఆర్ కో ఆర్డినేటర్ నిషాంత్, విశ్రాంత సైంటిస్టు డాక్టర్ పాండే చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకున్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి



నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

పోలవరం, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) : పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించి ఎన్నికల హామీని అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కె.భాస్కర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. సామాన్యులపై విద్యుత్ చార్జీల భారం తగదన్నారు. స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ మండల కమిటీ సభ్యులు బి.భూచంద్రం, టి.బాలరాజు, ఎస్.సాయికృష్ణ, గంగాదేవి పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డుల కోసం ఉత్తర్వులు రాలేదు

పోలవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కొత్త రేషన్ కార్డులు కోసం అధికారికంగా ఉత్తర్వులు రాలేదని తహసీల్దారు కె.శీనివాస్ తెలిపారు. గ్రామ వార్డు సచివాలయాల్లో ఎటువంటి ఆప్షన్ అందుబాటులో లేదన్నారు. తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రసార మాధ్యమాల్లో కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 2 నుంచి ప్రారంభమవుతుందని ప్రచారం జరిగిన నేపథ్యంలో అనేక మంది కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారన్నారన్నారు. ప్రస్తుతానికి అటువంటిది ఏమి లేదని ఉత్తర్వులు వచ్చిన వెంటనే గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు సమాచారం అందజేస్తామన్నారు.

నారాయణకు మద్దతుగా ప్రచారం

ఏలూరు కార్పొరేషన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గంధం నారాయణరావును ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన సంఘాలు దాదాపు 25 బలపరుస్తున్నాయని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.వెంకటేశ్వరరావు తెలిపారు. నారాయణరావుకు మద్దతుగా మంగళవారం పలువురు ఉపాధ్యాయులను కలుసుకుని మొదటి ప్రాధాన్యత ఓటు నారాయణరావుకు వేయాలని అభ్యర్థించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నారాయణరావు ఎనలేని కృషి చేస్తారని హామీ ఇచ్చారు. ఏఐటీయూసీ, బీకేఎంయు తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జన గణనలో కుల గణన చేపట్టాలి

ఏలూరు రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జనగణనలో సమగ్ర కులగణన నిర్వహించాలని, బీసీ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా యాదవ సంఘం భవనంలో బీసీ చైతన్య వేదిక రాష్ట్ర స్థాయి సమావేశం బీసీ కులాల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యు.గోపాలకృష్ణ అధ్యక్షతన మంగళవారం జరిగింది. శ్రీనివాస్ మాట్లాడుతూ అత్యధిక జనాభా ఉన్న బీసీలు విద్య, వైద్య, రాజకీయరంగాల్లో ముందుకు సాగేందుకు చైతన్యవేదిక కృషిచేస్తుందన్నారు. నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా బి.హరిప్రసాదాచారి, ప్రధాన కార్యదర్శిగా ఈవీ ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సి.శ్రీనివాస్, కార్యదర్శిగా కి. శ్రీనివాసరావు, యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎం.రాజుయాదవ్, ఏలూరు జిల్లా యువజన అధ్యక్షుడిగా బీజీ శంకర్‌ను నియమించి నియామకపత్రాలు అందచేశారు. బీసీ చైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి త్యాగరాజు పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే మద్దిపాటి



ద్వారకాతిరుమల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దేశంలో అన్ని మతాలకు ప్రాధాన్యత ఉందని, మతాలకు వ్యతిరేకంగా ఎవరైనా అనుచిత వాఖ్యలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు హెచ్చరించారు. లక్ష్మీపురంలోని బేతేలు స్వస్థత శాలలో మంగళవారం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. కేండిల్స్ వెలిగించి కేక్ కట్ చేశారు. బేతేలు స్వస్థత శాల నిర్వాహకులు, పాస్టర్లు ఆయనను ఘనంగా సత్కరించారు.

ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తాం



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూ టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజలు కూటమి ప్రభుత్వంపై పెట్టుకున్న ఆశలు, ఆకాంక్షలను నెరవేరుస్తామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎమ్మెల్యే బడేటి క్యాంపు కార్యాలయంలో మంగళవారం ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. చంటి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్ధానాలన్నిటిని నెరవేరుస్తామన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామన్నారు. తనవద్దకు వచ్చిన వారి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. బెల్లకొండ కిషోర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



సమస్యలు వింటున్న ఎమ్మెల్యే ప్రభాకర్

పెదవేగి, డిసెంబరు 3 : సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా పనులు చేస్తున్నామని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో మంగళవారం పలువురి నుంచి వినతులు స్వీకరించారు. అందరి సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా అడుగులు ఉంటాయని ప్రభాకర్ స్పష్టం చేశారు. పార్టీనాయకులు బి.సుధాకర్, టి.సత్యనారాయణ, ఎం.శ్రీనివాసరావు, ఎం.నారాయణ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వంతెన పనులు పరిశీలించిన ఎమ్మెల్యే ధర్మరాజు



భీమడోలు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గుండుగొలనులోని ఏలూరు కాల్వపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు స్థానిక నాయకులతో కలిసి మంగళవారం పరిశీలించారు. పనుల పురోగతిపై ఆరా తీశారు. కూటమి నాయకులు, పాల్గొన్నారు. అనంతరం గుండుగొలనులోని సో మరాజు జిల్లా పరిషత్ హైస్కూలును తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే ఆహారాన్ని, మౌలిక వసతులపై విద్యార్థులను అడిగి తెలుసు కున్నారు. స్కూల్ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న తరగతి గదులను పరిశీలించారు.

బాలికల బంగారు భవిష్యత్‌కు పునాది

కిశోర బాలికల వికాసం2.0లో అధికారులు



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్

చింతలపూడి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గ్రామ స్థాయి నుంచి బాలికలు బంగారు భవిష్యత్తుకు కిశోర బాలికల వికాసం 2.0 పునాది లాంటిదని ఐసీడీఎస్ పీవో మాధవి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా ఉదయం 19 గ్రామ పంచాయతీలకు, సాయంత్రం పట్టణ పరిధిలోని 20 కమిటీ లకు మంగళవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణలో అధికారులు మాట్లాడుతూ ఇప్పటికే కమిటీల ఎంపిక పూర్తయ్యిందన్నారు. నెలలో రెండు, నాలుగు శనివారాలలో కమిటీల పరిధిలో ఉన్న కిశోర బాలికలకు ఆరోగ్యం, పౌష్టికాహారం, పరిశుభ్రత, తదితర అవకాశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. కమిషనర్ డి.పావని, ఎంపీడీవో మురళీకృష్ణ పాల్గొన్నారు.

● పెదవేగి : బాలికల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీడీవో పి.శ్రీనివాస్ అన్నారు. కిశోర బాలికా వికాసంపై ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ స్థాయి కమిటీలకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో మాట్లాడుతూ బడి మానిన 15 ఏళ్లలోపు పిల్లలను గుర్తించి, తిరిగి పాఠశాలల్లో చేర్పించే చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే వారికి ఇష్టమైన రంగాల్లో నైపుణ్యాన్ని అందించాలని ఈ విషయంలో గ్రామ కమిటీలు బాధ్యతను తీసుకోవాలన్నారు. ఎంఈవో-2 వి.అరుణ్‌కుమార్, ఈవోపీఆర్డీ షరీఫ్, సీహెచ్‌వో డి.రోజ్ మేరీ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, మేరీబాయి, పార్వతి, పంచాయతీ కార్యదర్శులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

● ఉంగుటూరు : కిషోర బాలికలకు స్కిల్ డెవలప్‌మెంట్, ఆరోగ్యం, లైంగిక వేధింపులపై అవగాహన కల్పిస్తామని ఎంపీడీవో జీఆర్ మనోజ్ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన కిశోర్ బాలికల వికాసం 2.0పై సమావేశం నిర్వహించారు. ఐఈడీఎస్ సూపర్‌వైజర్లు శారదామని, బీవీ శ్రీలక్ష్మీ , ఏపీఎం ప్రభావతి పాల్గొన్నారు.

● భీమడోలు : స్థానిక ఐకేపీ కేంద్రంలో కిశోర బాలికా వికాసం కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో పద్మావతిదేవి పలు సూచనలు ఇచ్చారు. పంచాయతీ అధికారి సుందరి, సీడీపీవో విజయలక్ష్మి, ఎస్ఐ సుధాకర్, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు సీల్

పోలవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి మద్యం షాపులు మూసివేశారు. మద్యం షాపులకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు సీలు వేశారు.

● జంగారెడ్డిగూడెం :జంగారెడ్డిగూడెం సర్కిల్ పరిధిలోని 16 మద్యం దుకాణాలు మూసి వేసినట్లు ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు తెలిపారు.

చిన్న చిన్న లోపాలకు కుంగిపోకూడదు



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి రత్న ప్రసాద్

ఏలూరు క్రైం, డిశంబరు 03 (ఆంధ్రజ్యోతి) : పుట్టుకతో వచ్చిన చిన్న చిన్న లోపాలకు కుంగిపోకూడదని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ అన్నారు. ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా మంగళవారం ఏలూరు శనివారపుపేట దొండ పాడులో ఉన్న విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జడ్జి రత్నప్రసాద్ హాజరయ్యారు. జిల్లా దివ్యాంగుల సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఏడీపీ రమణకుమార్, పరివర్తన పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి పలువురు పాల్గొన్నారు.

వీఆర్‌వోల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు రూరల్, డిసెంబరు3,(ఆంధ్రజ్యోతి): వీఆర్‌వోల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు వీఆర్‌వోల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బి.రవీంద్రరాజు ఆధ్వర్యంలో నాయకులు వినతి పత్రం అందజేశారు. రెవెన్యూ వ్యవస్థ బలోపేతానికి చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామ రెవెన్యూ అధికారులందరికి డీడీవోలుగా తహసీల్దార్‌లుగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటీవల కాలంలో గ్రామరెవెన్యూ అధికారులు తీవ్ర పని ఒత్తిడితో ఇబ్బందులకు పడుతున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.లక్ష్మినారాయణ, ఎన్టీఆర్ జిల్లా డివిజన్ అశ్యక్షులు ఎండీఎస్ బాబ్జి, సత్తెనపల్లి డివిజన్ అధ్యక్షులు వి.వెంకటరామిరెడ్డి, షేక్ ఇబ్రహీం సాహేబ్ పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనుల్లో చెట్ల తొలగింపు



కుక్కునూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కుక్కునూరు, అశ్వారావుపేట ఆర్‌అండ్‌బీ రహదారికి ఇరువైపులా లక్షలాది రూపాయలు వెచ్చించి నాలుగేళ్ల క్రితం మొక్కలునాటి సంరక్షించారు. నేడు అవిఏపుగా పెరిగి చక్కటి నీడనివ్వటమే కాకుండా చూపరులకు ఆహ్లాదం కలిగించేవి. అయితే ఇటీవల ఆర్‌అండ్‌బీ రహదారి విస్తర్ణ పనులు చేపట్టారు. దీంతో రోడ్డు పక్కనే ఉన్న చెట్లను తొలగిస్తూ సైడ్‌బర్మ్‌లు నిర్మిస్తున్నారు. ఈ క్రమంలో అడ్డుగా ఉన్నాయని చెట్లను తొలగిస్తున్నారు. యంత్రాలతో పెద్ద చెట్లను తీసివేస్తున్నారు. చెట్లన్ని తొలగించటంపై అందరిలో ఆవేదన వ్యక్తమవుతోంది.

క్రైమ్ కార్నర్

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

పెదవేగి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) : లక్ష్మీపురంలో మూల్పూరి వీరామణి అనే మహిళ ఇంట్లో చోరీ జరిగిందని పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు. వీరామణి గత అక్టోబరులో బెంగళూరులో కుమార్తె దగ్గరకు వెళ్లిందన్నారు. ప్రతిరోజు పని మనిషి ఇంటి దగ్గర శుభ్రం చేస్తుందని, మంగళవారం ఇంటికి వెళ్లిన ఆమెకు తలుపులు తెరిచి ఉండడంతో ఆమె బంధువుల ద్వారా బెంగళూరులో ఉన్న వీరామణికి చెప్పారు. ఈ చోరీలో బీరువాలో ఉన్న అర కేజీ వెండి వస్తువులు, రూ.15 వేల నగదును గుర్తు తెలియని దొంగలు దోచుకుపోయినట్లు ఇచ్చిన ఫిర్యాదుపై కేసున మోదుచేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

మహిళపై దాడి

విజయరాయి సమీపంలో మెట్టమీద ఉంటున్న బొంకు కమలను సరిహద్దు వివాదంలో పక్కింటికి చెందిన దుర్గాటి మాణిక్యాలరావు దాడిచేసి, చాకుతో పొడిచాడని పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు. ఈ దాడిలో పొట్ట వద్ద గాయం కావడంతో ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించారని, కమల ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం

ఏలూరు క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కాలేజికి వెళ్లిన ఒక విద్యార్థిని తిరిగి రాలేదని ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేశారు. ఏలూరులోని నిమ్మకాయల మార్కెట్ యార్డు ప్రాంతానికి చెందిన ఒక యువతి (24) ఏలూరు రామచంద్ర ఇంజనీరింగ్ కాలేజీలో ఎంబీఏ ఫైనల్ ఇయర్ చదువుతుంది. ఈనెల 2న ఆమె తండ్రి ఆ విద్యార్థినిని తన మోటారు సైకిల్‌పై ఏలూరు పాతబస్టాండ్ వద్ద దించారు. అక్కడ నుంచి ఆర్టీసీ బస్సులో కాలేజీకి వెళ్లింది. ఆమె తిరిగి రాలేదు. ఆమె కోసం వెతికిన ప్పటికి ఆచూకీ కానరాకపోవడంతో ఏలూరు టూటౌన్ పోలీసులకు ఆ విద్యార్థిని తల్లి ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెల్టు షాపుపై కేసు నమోదు

చింతలపూడి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అల్లిపల్లిలో మద్యం అమ్ముతున్న కసిని శాంతి అనే మహిళ నుంచి 20 డ్యూటీ పెయిడ్ మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు. ఆమెను తహసీ ల్దార్ ఎదుట హాజరుపరిచి బైండోవర్ నమోదు చేసినట్లు తెలిపారు. ఎక్సైజ్ ఎస్ఐ అబ్దుల్ ఖలీల్ పాల్గొన్నారు.

దివ్యాంగుల నైపుణ్యతకు ప్రత్యేక శిక్షణ

ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం



జంగారెడ్డిగూడెంలో పౌష్టికాహారం అందజేస్తున్న దాతలు

ఏలూరు అర్బన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ జిల్లా కార్యక్రమాలను మంగళవారం స్థానిక అశోక్‌నగర్‌లోని అశోక వర్ధిని మున్సిపల్ స్కూలు ఆవరణలోవున్న సమగ్రశిక్ష భవిత కేంద్రంలో నిర్వహించారు. సమగ్రశిక్ష విలీనవిద్య ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల నైపుణ్యతను గుర్తించి వారిని ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడానికి చేపట్టిన చర్యలను జిల్లా కో ఆర్డినేటర్ భాస్కరరాజు వివరించారు. దివ్యాంగులకు నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఏలూరు ఎంఈవో-2 రంగయ్య, హెచ్ఎం పార్వతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● చింతలపూడి : సమాజంలో దివ్యాంగులను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని చింతలపూడి జూనియర్ న్యాయాధికారి సి.మధుబాబు అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. న్యాయప రంగా వారికి ఎటువంటి సలహా కావాలన్నా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచితన్యాయం అందిస్తామన్నారు. అనంతరం దివ్యాంగులకు పలకాలు, పుస్తకాలు, బాక్సులు పంపిణీ చేశారు. ఎంఈవో ఎస్.కిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం : స్థానిక ఇందిరా నగర్ కాలనీలో ఉన్న భవిత పాఠశాలలో, ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం జరిగింది. విభిన్న ప్రతిభావంతులకు, వారి కుటుంబ సభ్యులకు పలువురు దాతలు భోజనం, నూనె, పౌష్టికాహార ప్యాకెట్లు అందచేశారు. ఎంఈఓ-2 రాముడు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.రామచంద్రరాజు,బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్, కౌన్సిలర్ వి.తాతాజీ, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● పెదవేగి : అంతర్జాతీయ విభిన్నప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పెదవేగిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో -1,2 ఏఎస్వీప్రసాద్, వి.అరుణ్‌కుమార్, ఐఈఆర్ ఉపాధ్యాయులు విజయలక్ష్మి పాల్గొన్నారు.

● భీమడోలు : స్థానిక జడ్పీ హైస్కూల్లో జరిగిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో ఎంఈవో భాస్కర్‌కుమార్, దాతలు భోజన ఏర్పాట్లు, దివ్యాంగులకు నీరు, పండ్లు అందజేశారు. ఉపాధ్యాయులు, దాతలు పాల్గొన్నారు.

● లింగపాలెం : ధర్మాజీగూడెం భవితా కేంద్రంలో నిర్వహించిన వేడుకలలో ఎంఈవో కె.రామారావు జి.రవీంద్ర, బీవీఎస్ఎన్ రాజు. ఫిజియోథెరపిస్టు ఎం.శ్రీనాథ్, ఉపాధ్యాయులు, దివ్యాంగ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): డిసెంబర్ 2న ఏలూరులో జరిగిన జిల్లా స్థాయి ర్యాపిడ్ అండ్ బ్లిట్జ చెస్ ఛాంపియన్ షిప్-2024 పోటీలలో పట్టణానికి చెందిన కె.చేతనచంద్ర, పి.సాధిక్‌వర్మ ప్రథమ బహుమతి పొందినట్లు మాస్టర్ చెస్‌అకాడమి కోచ్ ఐ.సరళామాధవి తెలిపారు.

పని ఒత్తిడి తగ్గించండి

ఏలూరు టూ టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల్లో పని చేస్తున్న ఏఎస్ఎంలపై పని ఒత్తిడి తగ్గించాలని ఏపీ ఎన్‌జీఎస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సి.శ్రీనివాస్, ఎస్.రామారావు కోరారు. మున్సిపల్ కమిషనర్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏఎస్ఎంలకు ఇతర విధులు అప్పజెప్పకూడదన్నారు. ఏఎస్ఎంలకు అదనపు విధులు కేటాయించమని కమిషనర్ భానుప్రతాప్ తెలిపారు. అయితే నగరాభివృద్ధి కోసం అవసరమైనప్పుడు పన్నులు వసులు చేయడం, సర్వేలు నిర్వహించాల్సి వస్తుందన్నారు. కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, అడిషనల్ కమిషనర్ చంద్రయ్య, ఎస్.శ్రీనివాస్, పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల వినతి

ఉంగుటూరు, డిసెంబరు 3 ఆంధ్రజ్యోతి): రోజు రోజుకూ పెరుగుతున్న పనిఒత్తిడి తగ్గించాలంటూ మండల పంచాయతీ కార్యదర్శులు మంగళవారం ఎంపీడీవో మనోజ్‌కు వినతిపత్రం అందజేశారు.

వంద రోజుల కార్యాచరణను సవరించాలి

ఏలూరు అర్బన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అసంబద్ధంగా ఉన్న ఎస్సీఈఆర్టీ ప్రకటించిన వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను సవరించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామారావు, రెడ్డిదొర డిమాండ్ చేశారు. ఈ నెలా ఖరుకు సిలబస్ పూర్తవుతున్న విషయాన్ని విద్యా శాఖ ఉన్నతాధికారులు పరిగణనలోకి తీసుకోవాలన్నారు. సంక్రాంతి సెలవుల తర్వాతే కార్యాచరణ ప్రణాళికను అమలుచేయాలన్నారు.

మెగా పరిశ్రమ ఏర్పాటుకు ఎమ్మెల్యే సన్నాహాలు



చీఫ్ సెక్రటరీ నీరబ్‌కుమార్‌ను కలిసిన ఎమ్మెల్యే రోషన్‌కుమార్

చింతలపూడి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో మెగా పరిశ్రమల ఏర్పాటుకు ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ సన్నాహాలు ప్రారంభించారు. దీనిపై గతంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి ప్రతిపాదనను అందజేశారు. ప్రభుత్వం కూడా ఈ ప్రతిపాదనను పరిశీలించి తదుపరి చర్యలకు ఆదేశాలు ఇచ్చింది. దీంతో మంగళవారం చీఫ్ సెక్రటరీ నీరబ్‌కుమార్ ప్రసాద్‌ను ఎమ్మెల్యే కలిసి వివరించారు. అందుకు ఆయన కూడా సుముకత వ్యక్తం చేశారు. ఇండస్ట్రియల్ ఏర్పాటుపై మౌలిక సదుపాయాలు ప్రధానంగా ఉన్నాయని, వాటిని పరిశీలించే దిశగా సహకరించాలని ఆయన కోరారు.

10న ఛలో విజయవాడ

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ రద్దు కోరుతూ ఈ నెల 10న నిర్వహించ తలపెట్టిన ఛలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ సీపీఎస్ ఈఏ రాష్ట్ర కార్యదర్శి ఆర్.నాగదుర్గారావు పిలుపునిచ్చారు. తాడువాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఛలో విజయవాడ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీపీఎస్ ఉద్యోగులకు 2018 జూలై నుంచి డీఏ అరియర్స్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆ సంఘ నాయకులు రమేష్, ఏసురత్నం, భాస్కర్ పాల్గొన్నారు.

26న జిల్లా సీపీఎం మహా సభలు

బుట్టాయగూడెం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రామంలో 26న జరగనున్న సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి ఎ.రవి పిలుపునిచ్చారు. మహాసభల వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. రవి మాట్లాడుతూ మూడేళ్లకోసారి జరిగే మహాసభలను బుట్టాయగూడెంలో మొదటిసారిగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 13వ తేదీ మొదటి రోజున బహిరంగ సభ జరుగుతుందని సభకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాస్, కార్యదర్శివర్గ సభ్యుడు వి.ఉమామహేశ్వరావు, ఎం.సీతారామ్ హాజరవుతారని తెలిపారు. నాయకులు టి.రామకృష్ణ, పి.నాగేశ్వరావు పాల్గొన్నారు.

టీఎన్‌యూఎస్ జిల్లా అడహక్ కమిటీ నియామకం



శర్వాణి, రమణకుమారి

ఏలూరు అర్బన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ అనుబంధ విభాగం తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం ఏలూరు జిల్లా శాఖకు అడహక్ కమిటీని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ మంగళవారం ప్రకటించారు. సంఘ జిల్లా అధ్యక్షురాలిగా నిడమర్రు మండలం అడవికొలను జడ్పీ హైస్కూలు టీచరు ఎన్‌వీఎల్ శర్వాణి, ప్రధాన కార్యదర్శిగా ఏలూరు ఏఆర్‌డీజీకే మున్సిపల్ హైస్కూలు టీచరు బీవీ.రమణకుమారిని నియమించారు. కోశాధికారిగా ఏలూరు కస్తూరిబా మున్సిపల్ హైస్కూలు ఉపాధ్యాయుడు కె.శివశంకర్‌రాజు, గౌరవాధ్యక్షుడిగా బీఎంఎం చౌదరి నియమితులయ్యారు. వీరికి సంఘ జిల్లా కన్వీనర్ ఎస్.రాంబాబు, సీనియర్ నాయకులు పి.సత్యనారాయణ శుభాకాంక్షలు తెలిపారు.

అత్యాచారాలు అరికట్టాలి

ఏలూరు అర్బన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మహిళలపై అత్యాచారాలను, లైంగిక దాడులను అరికట్టాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక సీఆర్ఆర్ ఫార్మసీ కళాశాల విద్యార్థులతో 'ఐద్వా' ఆధ్వర్యంలో ర్యాలీ, అవగాహన సదస్సు జరిగాయి. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ మహిళల వస్త్రధారణపై అనుచితంగా సంభాషించేకంటే, వారిపట్ల వ్యవహరించాల్సినతీరుపైనే పురుషులకు అవగాహన కల్పించడం మంచిదన్నారు. మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్సై కాంతిప్రియ మాట్లాడుతూ కళాశాలలు, విద్యాసంస్థలవద్ద విద్యార్థినులపై వేధింపులు అరికట్టడానికి ఏర్పాటు చేసిన అభయ బ్లూకార్స్ 112 టోల్ ఫ్రీ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కరస్పాండెంట్ మాగంటి రాజారామ్మోహనరావు, మహిళాసాధి కారత, గ్రీవెన్స్ విభాగం కో-ఆర్డినేటర్ కేహెచ్ మౌనిక, డాక్టర్ ఉషారాణి, జాబిలి, 'ఐద్వా' జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హైమావతి, శ్యామలరాణి, శారద, అరుణ, కస్తూరి, ఫార్మసీ విద్యార్థినులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో జర భద్రం

ఏలూరు క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరగాళ్లతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏలూరు జిల్లా సైబర్ సెల్ ఎస్ఐ మధువెంకటరాజా అన్నారు. ఏలూరు అమీనాపేటలో ఉన్న సురేష్‌చంద్ర బహుగుణ పోలీస్ ఇంగ్లీషు మీడియం స్కూల్లో మంగళవారం సైబర్ నేరాల నియంత్రణ, సోషల్ మీడియా అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఐ రాజా మాట్లాడుతూ ఎవరైనా సైబర్ నేరానికి గురైతే 1930కు కాల్ చేసి తెలియజేయాలన్నారు. విద్యార్థులు పాల్గొన్నారు.

90 శాతం రాయితీపై బిందు సేద్యం

జీలుగుమిల్లి, డిసెంబరు, 3 (ఆంధ్రజ్యోతి) : 90శాతం రాయితీపై రైతులకు బిందు సేద్యం సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పిస్తున్నట్లు ఉద్యాన అధికారి ఆర్.నవీనమణిమాల అన్నారు. పి.రాజవరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో కె.గంగాధరం ఆధ్వర్యంలో జరిగింది. మినుము, పెసర, మొక్కజొన్న సాగు చేసే రైతులు పంటల బీమా చేయించుకోవాలన్నారు. పశు గణన సర్వేలో రైతులు వివరాలు తెలిపి సహకరించాలన్నారు. వీఏఏ లావణ్య, కె.శశిప్రియ, రైతులు పాల్గొన్నారు.

ఆళ్ల నానీ.. ఆగండి



- సీఎంతో చర్చలు వాయిదా.. ఏలూరులో తీవ్ర వ్యతిరేకతే కారణం
- అందుబాటులోకి ఎంపీ మహేశ్, జిల్లా అధ్యక్షుడు గన్ని
- ఉండవల్లి వైపు చూడని సిట్టింగ్ ఎమ్మెల్యే చంటి.. 9కి వాయిదా

మాజీ మంత్రి ఆళ్ల నాని టీడీపీలో చేరే ముహూర్తం వాయిదా పడింది. ఏలూరు నియోజకవర్గంలో ఆయనకు వ్యతిరేకంగా ప్రకంపనలు చెలరేగడంతో టీడీపీ నాయకత్వం ఈ నిర్ణయం తీసుకుంది. తొలుత రాష్ట్ర మంత్రివర్గం సమావేశం పూర్తయిన తర్వాత మంగళవారం ముఖ్యమంత్రి, పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుతో ఆళ్ల నానితోపాటు మిగతా ఎమ్మెల్యేలు కలవాల్సి ఉంది. కొంత చర్చలు జరిగిన తరువాత నానిని నేరుగా పార్టీలో చేర్చుకుంటారా, లేదంటే కొంత గడువు ఇచ్చి భారీ బలగం మధ్య ఆయన ప్రవేశం ఉంటుందా అనే దానిపై తర్జనభర్జన జరిగింది.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఆళ్ల నాని వ్యవహారంలో సోమవారం నుంచే ఒకింత గందరగోళం ఏర్పడింది. ఆయన టీడీపీలోకి రానున్నారని పార్టీ సంకేతాలు పంపగా, ఆ వెంటనే ఏలూరులో టీడీపీ కేడర్ సీరియస్‌గా స్పందించింది. గడిచిన ఐదేళ్లల్లో పార్టీ నేతల ఆస్తులు ధ్వంసం, అక్రమ కేసుల నమోదు, వ్యక్తిగత దాడులను ప్రోత్సహించిన నానిని పార్టీలోకి చేర్చుకోవాల్సిన అవసరం ఏమొచ్చిందని తీవ్ర స్థాయిలోనే సీనియర్లంతా బహిరంగంగా వ్యాఖ్యల కు దిగారు. సిట్టింగ్ ఎమ్మెల్యే బడేటి చంటితోను ఈ అంశంపై మాట్లాడేందుకు ప్రయత్నించారు. పార్టీ కేడర్‌లో అత్యధికులు నాని రాకను వ్యతిరేకి స్తున్నందున తాము దానిని అంగీకరించాల్సి వస్తుందన్న అభిప్రాయాన్ని అధినాయకత్వం దృష్టి కి తీసుకువెళ్ళారు. ఈలోపే గడిచిన ఐదేళ్లపాటు టీడీపీకి వ్యతిరేకంగా సాగిన దురాగతాలను సోష ల్ మీడియాలో హోరెత్తించారు. తమను కాదని పార్టీలోకి వస్తే మీకు అవమానాలే అంటూ నాని నుద్దేశించి అనేకమంది కామెంట్లు పెట్టారు. జిల్లాలో పార్టీ ఎమ్మెల్యేలతోపాటు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్‌తో సహా అందరూ మంగళవారం అందుబాటులో ఉండాలని సోమవారం రాత్రి స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో మంగళవారం పార్టీ ఆదేశాల మేరకు ఢిల్లీలో ఉన్న ఎంపీ మహేష్‌తోపాటు గన్ని ఉండవల్లికి చేరుకున్నారు. నియోజకవర్గంలో వెల్లువెత్తిన వ్యతిరేకతను ముందు అధినాయకత్వం దృష్టికి తీసుకు రావాలని వీరు సంకల్పించారు.

ఎందుకింత వ్యతిరేకత ?

జగన్ పాలనలో మిగతా నియోజకవర్గాల మాదిరిగానే ఏలూరులో అనేక సంఘటనలు తెలుగుదేశంకు వ్యతిరేకంగా చోటు చేసుకున్నాయి. టీడీపీలో అత్యంత కీలకంగా వ్యవహరిస్తున్న నేతలను టార్గెట్‌గా చేసుకుని వారి వ్యాపార సముదాయాలను ధ్వంసం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా కట్టడాలు నిర్మించారనే సాకుతో కూల్చివేశారు. దీనిని అడ్డుకోవడానికి ప్రయత్నించిన వారిపైనా పోలీసులు బెదిరింపు ధోరణికి పాల్పడ్డారు. దీనికితోడు నాని వరుసగా ఎన్నికల్లో పోటీ చేయడం, ఆయన వెంటే కేడర్ కొనసాగుతుండడంతో ఆయన నిర్ణయమే ఏకపక్షమైంది. ఈ తరుణంలో గత ఎన్నికల్లో తనకు తిరుగులేదనుకున్న నానికి చేదు అనుభవం ఎదురైంది. భారీ ఓటమిని మూటకట్టుకున్నారు. నియోజకవర్గ ఓటర్లు అత్యధికులు ఆయన పట్ల వ్యతిరేకత ప్రదర్శించినట్లయ్యింది.

నేడు పార్టీ కార్యాలయానికి చంటి

పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించే వినతుల స్వీకరణలో పాల్గొనేందుకు సిట్టింగ్ ఎమ్మెల్యే చంటికి బుధవారం అవకాశం దక్కింది. ఇదే తరుణంలో సీఎం చంద్రబాబు వినతుల స్వీకరణలో పాలుపంచుకోబోతున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, సీఎం మధ్య కొంత సంభాషణ జరిగినా ఆశ్చర్యపోనక్కర్లేదని భావిస్తున్నారు. ఎమ్మెల్యే కూడా ఉన్న పరిస్థితులను ఆయనకు వివరించనున్నారు. ఈ నెల 9న ఆళ్ల నాని రాకకు దాదాపు ముహూర్తం ఖరారు చేయడంతో ఈ పరిణామాలు ఎలా ఎదుర్కోవాలని నియోజకవర్గంలో టీడీపీ నేతలంతా తర్జనభర్జనలు పడుతున్నారు.

ఎమ్మెల్యే ఏం చేయబోతున్నారు ?

తాజా పరిణామాల నేపథ్యంలో ఎమ్మెల్యే బడేటి చంటి నిర్ణయా న్ని పార్టీ నాయకత్వం పరిశీలనలోకి తీసుకోబోతుంది. ఈ నెల 9న నాని పార్టీలో చేరే విషయంలో నిర్దిష్ట అభిప్రాయానికి రానున్నారు. ఈలోపే నియోజకవర్గంలో చెలరేగిన అసంతృప్తిని ఏ రూపంలో పార్టీ అంచనా వేస్తుందనేది అందరి ప్రశ్న. ఈ తరుణంలోనే ఎమ్మె ల్యేపై పార్టీ కేడరంతా పూర్తి బాధ్యతలను అప్పగించింది. మేమైతే నానిని పార్టీలోకి తీసుకుంటే బాగుండదని చెబుతున్నాం. వైసీపీ హయాంలో నష్టకష్టాలను అనుభవించాం. మళ్ళీ వాళ్ళనే పార్టీలోకి తీసుకోవాలా, వద్దా అనే తుది నిర్ణయానికి రండి అంటూ ఎమ్మె ల్యేపై ఒత్తిడి పెంచారు. దీంతో మంగళవారం పార్టీ నుంచి పిలుపు వచ్చినా చంటి ఆ వైపు చూడనేలేదు. ఏదైనా నిర్ణయం తీసుకుంటే మీ ఇష్టం, ఇక్కడ అత్యధికులు నాని రాకను వ్యతిరేకిస్తున్నారని ఎమ్మెల్యే పార్టీకి చేరవేశారు. దీంతో మంత్రివర్గ సమావేశం పూర్త యిన వెంటనే పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్యులతో సీఎం చంద్రబాబు భేటీ కావాలనుకున్నా ఆఖరు నిమిషంలో వాయిదా వేసుకున్నారు. ఏలూరు ఎమ్మెల్యే వచ్చారా, రాలేదా అని టీడీపీ పెద్దలు ఆరా తీశారు. అప్పటికే ఎంపీ మహేష్‌యాదవ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు గన్ని మాత్రమే అందుబాటులోకి వచ్చారనే విషయం పార్టీకి చేరింది. అయినప్పటికీ స్థానిక ఎమ్మెల్యే రాకుంటే ఇక మాట్లాడేది లా అంటూ ఈ నెల 9న తేలుద్దామని ప్రస్తుత భేటీని వాయిదా వేసుకున్నారు. నాని పార్టీలో చేరే వ్యవహారం మంగళవారం తేలిపోతుందని భావించినా దీనికి విరుద్ధమైన పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఒకప్పుడు ఉప ముఖ్యమంత్రిగా వ్యవహరించిన ఆళ్ల నాని స్థానికంగా అంత బలవంతుడైతే తమకు ఎవరికీ అభ్యంతరంలేదని, కేవలం అవకాశం కోసమే పార్టీలోకి వస్తున్నారనే అభిప్రాయాన్ని నియోజకవర్గమంతటా వినిపించింది. ఈ విషయంలో ఉండవల్లికి రావాల్సిందిగా ఎమ్మెల్యే చంటిని పదేపదే కోరినా ఫలితం లేకపోయింది.

సంక్రాంతికి ముందే సై



- జిల్లాలో జూదాల జాతర
- రోజుకో మండలాన్ని మారుస్తూ లక్షల్లో జూదాలు
- చోద్యం చూస్తున్న పోలీసులు

భీమవరం క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ ఇంకా 40 రోజులు ఉండగానే జిల్లాలో జూదాల జాతర మొదలైంది. పేకాట, కోడి పందాలతో పందెంరాయుళ్ళు మంచి జోష్ మీద ఉన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో పేకాట, కోడిపందాలు జోరుగా సాగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. కొందరు రాజకీయ నాయకుల అండదండలతో రాత్రివేళల్లో ఫ్లడ్ లైట్ల వెల్తురులో కాంతుల్లో భారీగా పందేలు సాగుతున్నాయి. దీంతో లక్షలు చేతులు మారుతున్నాయి. కొందరు దూర ప్రాంతాల నుంచి వచ్చి నాయకులు అనుమతితో జూదం నిర్వహిస్తున్నట్లుగా సమాచారం. అలాగే అధికారులు కూడా అటువైపు కన్నెత్తి చూడకుండా ఉండేందుకు భారీ ముడుపులు ఇచ్చి ఇలా జూదాలు నిర్వహిస్తున్నట్టు చెబుతున్నారు. జిల్లా కేంద్రమైన భీమవరం చట్టుపక్కల ప్రాంతమైన ఒక గ్రామ పరిధిలో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో రాత్రి 11 గంటల సమయంలో వందల్లో కార్లు, ద్విచక్ర వాహనాలు అక్కడకు చేరుకున్నాయి. ఫ్లడ్ లైట్లు కూడా రెడీ చేశారు. అయితే ఒక పోలీసు అధికారి నిలుపుదల చేయాలంటూ ఆదేశాలు ఇవ్వడంతో కోడిపందేలు నిలిపివేశారు. అయితే ఆ సమయంలో ఆ గ్రామ పరిధి అంతా వాహనాలతో నిండిపోయింది. గ్రామ ప్రజలకు ఏం జరుగుతుందో అర్థం కాలేదు. అలాగే భీమవరం మండలంలోని ఒక గ్రామంలోని విల్లాస్‌లో నిత్యం పేకాట జరుగుతోందనే ప్రచారం జరుగుతోంది. పోలీసులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో అనేక వదంతులు వినిపిస్తున్నాయి. జిల్లాలోని కాళ్ళ మండల పరిధికి చెందిన ఒక వ్యక్తి కొన్నేళ్ళ క్రితం విశాఖ వెళ్ళి స్థిరపడ్డాడు. ఆ వ్యక్తి జిల్లాకు వచ్చి జూదాల నిర్వహణకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు సమాచారం. ఒక్కొక్కసారి ఒక్కో మండల పరిధిని ఎంచుకుని జూదగాళ్ళకు సమాచారం ఇవ్వడం, రెండు గంటల ముందుగానే సమాచారం అందుకున్న జూదగాళ్ళు అక్కడికి చేరిపోతున్నారు. దీంతో రాత్రి 3 గంటల వరకు జూదం నిర్వహించడం సర్వసాధారణమైపోయింది. అయితే ఆ వ్యక్తి కొందరు పోలీసు అధికారులకు భారీగా ముడుపులు అప్పచెప్పడం వల్లే పోలీసులు పెద్దగా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి.

ఏం కొనాలి.. ఏం తినాలి

ఏలూరు టూటౌన్, డిసెంబరు 3 (ఆంధ్ర జ్యోతి): నిత్యావసర ధరలు ఆకాశా న్నంటుతున్నాయి. సామాన్యులు షాపులకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు.అన్నిరకాల ధరలు పెరగడంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితుల్లో ప్రజలున్నారు. బియ్యం, పప్పులు, నూనెలు, కూరగాయలు, చికెన్, కోడిగుడ్లతో సహా అన్నిరకాల ధరలు రోజురోజుకి పెరుగుతూనే పోతున్నాయి. బియ్యం ధరలు సామా న్యులకు భారంగా మారాయి. సోనామసూరి కేజీ రూ.65కు చేరు కుంది. పీఎల్ రూ.55 -65 వరకు అమ్ము తున్నారు. కందిపప్పు కేజీ రూ.180 అయ్యింది. మినపప్పు రూ.140, పెసరపప్పు రూ.140లకు చేరుకున్నాయి. కేంద్ర ప్రభుత్వం వంటనూనెలపై దిగుమతి సుంకం పెంచడంతో వంటనూనె ధరలు కేజీకి గత రెండు నెలల్లోనే రూ.30 పెరిగింది. వేరుశనగనూనె కేజీ రూ.200, సన్‌ఫ్లవర్ రూ.180, నువ్వులనూనె రూ.480, రైస్‌రిచ్ ఆయిల్ రూ.170, కొబ్బరినూనె రూ.300కు చేరుకుంది. గత ఆరు నెలలతో పోలిస్తే నిత్యావసర వస్తువుల ధరలు 20 నుంచి 40 శాతం వరకు పెరిగాయి. ఈ ధరలు సామాన్యులను తీవ్రంగా భయపెడు తున్నాయి. కూర గాయల ధరలు కూడా సామాన్యులకు అందుబాటులో లేవు. ప్రతిరోజు వంటల్లో వాడే ఉల్లిపాయలు, టమోటా ధరలు మోత మోగిస్తున్నాయి. మూడు నెలల నుంచి ఉల్లిపాయలు కేజీ రూ.60 పైమాటే. ప్రతీ కూరలో వాడే టమోటాలు రూ.50కి చేరుకున్నాయి. వంకాయలు కేజీ రూ.50, బీరకాయలు రూ.60, క్యారెట్ రూ.70లకు ఎగబాకాయి. బెండ, దొండకాయలు, గోరుచిక్కుళ్ళు రూ.40 పైమాటే. చిక్కుళ్ళు రూ.80కి ఎగబాకాయి. ఆకు కూరలు కట్ట రూ.20 తక్కువ లేదు. సెప్టెంబరు, అక్టోబరు మాసాల్లో వచ్చిన వానలు, వరదలకు కూర గాయల పంటలు దెబ్బతిన్నాయి.

కూలాకే చర్యలా..?

- కూలేందుకు సిద్ధంగా ట్యాంకులు
- ఐదేళ్లలో నిర్వహణ శూన్యం
- కలుషిత నీరే దిక్కన్న గ్రామస్థులు





గోపవరం బీసీ కాలనీలో, యల్లాపురంలో ట్యాంకుల దుస్థితి

శిథిలావస్థకు చేరిన ట్యాంక్

ముసునూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి సరఫరా ట్యాంకులు శిథిలావస్థకు చేరాయి. మండలంలోని 16 పంచాయతీల పరిధిలో 60 ఓవర్‌హెడ్ ట్యాంకులు ఉన్నాయి. వీటిలో గోపవరం, ముసునూరు, గోగులంపాడు, యల్లాపురం, రమణక్కపేట గ్రామాల్లో ట్యాంకులను సుమారు 35 ఏళ్ళ క్రితం నిర్మించారు. ప్రస్తుతం వీటి స్తంభాలు బీటలువారి, పెచ్చులూడి ఐరన్ బయట పడింది. ట్యాంకులపైకి ఎక్కేందుకు ఉన్న మెట్లు ధ్వంసమయ్యాయి. కొన్ని ట్యాంకులకు ఉన్న ఐరన్ నిచ్చెనలు తుప్పుపట్టి విరిగిపోయాయి. దీంతో ఈ ట్యాంకుల నుంచి వచ్చే కలుషిత నీరే ప్రజలకు దిక్కవుతోంది. గత ప్రభుత్వ పాలనలో ఆర్‌డబ్ల్యూయస్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు వీటి నిర్వహణ గురించి పట్టించుకోపోవడం వల్ల మంచినీటి సరఫరా ట్యాంకుల పరిస్థితి మరింత అధ్వానంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వమైనా శిథిలావస్థకు చేరిన ఓవర్‌హెడ్ ట్యాంకులను తొలగించి, కొత్త ట్యాంకుల నిర్మాణానికి జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కొత్త ట్యాంకుల నిర్మాణానికి చర్యలు

కొన్ని గ్రామాల్లో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకులు శిథిలావస్థకు చేరడం వాస్తవమే. అయితే జలజీవన్ మిషన్ పథకంలో నూతన ట్యాంకుల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాం. నిధులు రాగానే కొత్త ట్యాంకుల నిర్మాణాలకు చర్యలు తీసుకుంటాం.

- కె.సత్యప్రసాద్, ఆర్‌డబ్ల్యూయస్ ఏఈ, ముసునూరు మండలం.

వెల్లువలా వినతులు



అర్జీలు స్వీకరిస్తున్న నూజివీడు ఎంపీడీవో

నూజివీడు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నూజివీడులో సారథి.. మన వారధి కార్యక్రమంలో అర్జీలు వెల్లువెత్తాయి. నూజివీడు మండల, పట్టణ పరిధిలో వివిధ సమస్యల పై మంగళ, బుధవారాల్లో అర్జీల స్వీకరణకు కార్యక్రమాన్ని ప్రారంభించగా నూజివీడు మండల పరిధిలో 531, పట్టణంలో 721 అర్జీలు దాఖలయ్యాయి. నూజివీడు పట్టణంలో గల 32 వార్డుల్లోని 16 సచివాలయాల్లో 721 అర్జీలు రాగా మండలంలోని 29 గ్రామాలకు సంబంధించి నూజివీడు ఎంపీడీవో కార్యాలయంలో అర్జీలను స్వీకరించారు. రెవెన్యూ శాఖ పరిధిలో 218, పంచాయతీరాజ్ శాఖ పరిధిలో 183, గృహ నిర్మాణశాఖ పరిధిలో 108, ఉపాధి హామీ పథకం పరిధిలో 11, విద్యు త్ శాఖకు సంబంధించి నాలుగు, పశుసంవర్థక, ఇరిగేషన్‌శాఖల పరిధిలో మూడు, ఆర్ అండ్ బీ శాఖ పరిధిలో ఒక అర్జీ దాఖలయ్యాయి.

చాట్రాయి: చాట్రాయి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బారులో రెవెన్యూకు సంబంధించి 37, వివిధ సమస్యలపై 29 మొత్తం 66 అర్జీలు అందినట్టు అధికారులు తెలిపారు. తహసీల్దార్ ప్రశాంతి, ఎంపీడీవో విజయలక్ష్మి అర్జీలు స్వీకరించారు. తనకు ప్యాంక్రియాస్ గ్రంధి పాడవటంతో 2022లో విజయవాడలో ఆపరేషన్ చేయించుకున్నానని, అప్పటి నుంచి నెలకు రూ. 9 వేలు మందులకు ఖర్చవుతోందని, ఈ మందులు జీవిత కాలం వాడాలని డాక్టర్లు చెప్పారని, నిరుపేదనైన తనకు ప్రభుత్వం ద్వారా మందులు ఉచితంగా ఇప్పించాలని చిన్నంపేట గ్రామానికి చెందిన కొమ్ము ఆనందం అర్జీ సమర్పించారు. ఈవోపీఆర్డీ నాగరాజు, టీడీపీ మండల అధ్యక్షురాలు బొట్టు వరలక్ష్మి, కూటమి నాయకులు బొట్టు లక్ష్మణరావు, కలకొండ భాస్కరరావు, జగన్, చెన్నారావు, శర్మ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముసునూరు: మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వేదికలో సమస్యలపై అర్జీలు వెల్లువెత్తాయి. తహసీల్దార్ కె.రాజ్‌కుమార్, ఎంపీడీవో జి.రాణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్ర మంలో 138 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. అత్యధికం రెవెన్యూ శాఖకు 106 అని వివ రించారు. అర్జీలను సంబంధిత శాఖల అధికారు లకు ఇవ్వడం జరిగిందన్నారు. ఈవోపీఆర్డీ శంకర్‌రావు, ఎంఈవో సుబ్బారావు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు సేవ అమూల్యం

చాట్రాయి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు సేవ చేయటం గొప్ప విషయమని తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు అన్నారు. చాట్రాయిలోని భవిత సెంటర్‌లో మంగళవారం దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు, పలు పోటీల్లో విజేతలకు కొండపర్వలోని బేతెస్థ చర్చి వారు బహుమతులు అందజేశారు. దాతల సహకారంతో దివ్యాంగులకు వారి తల్లిదండ్రులకు భోజన ఏర్పాట్లు చేశారు. భవిత స్కూల్ టీచర్ ధనలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంఈవో బ్రహ్మచారి, హెచ్‌ఎం రాము, వ్యాపార ప్రముఖుడు వీసం బుల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యం నింపాలి

ముసునూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపి వారిలో నైపుణ్యం వెలికితీయాలని ఎంపీపీ కొండా దుర్గాభవానీ, జడ్పీటీసీ డాక్టర్ ప్రతాప్, నియోజకవర్గ తెలుగుయువత కార్యదర్శి కొండేటి ఉదయ్ కిరణ్ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ముసునూరు మెయిన్ పాఠశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం దివ్యాంగ పిల్లలకు అందిస్తున్న ఉచిత సదుపాయాలతో పాటు ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. అనంతరం ఆటలపోటీల్లో విజేతలుగా నిలిచిన పిల్లలకు ప్రజాప్రతినిధులతో కలిసి ఎంఈవో సుబ్బారావు బహుమతులను అందచేశారు. పీఎంసీ చైర్మన్ నక్కా యోహాను, పాఠశాల హెచ్‌ఎమ్ ఎం.అన్నామణి, ఐఈఆర్పీలు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

నూజివీడు టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ పరిధిలో ఎస్సీ, ఎస్టీ, ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ఎన్నికను మంగళవారం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా కె.శివలాల్, ఉపాధ్యక్షుడిగా పి.సూర్యచంద్రరావు, ప్రధాన కార్యదర్శిగా జ్యోతిలాల్ నాయక్, కోశాధికారిగా డి.నాగార్జునా దేవి, సభ్యులుగా శ్యామ్, ఎస్.చిరంజీవి, సురేష్ తదితరులు ఎంపికయ్యారు. ఈ మేరకు నూతన అసోసియేషన్‌ను రిజిస్టర్ చేస్తూ అధికారిక రిజిస్ట్రేషన్ పత్రాన్ని ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్, నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ అమరేంద్రకుమార్‌కు సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమానికి చర్యలు తీసుకోనున్నట్లు సభ్యులు పేర్కొనగా, వారికి అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తామని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ హామీ ఇచ్చారు.







ముదినేపల్లిలో హైస్కూల్‌లో వీల్ చైర్ పంపిణీ, కైకలూరులో బహుమతులు అందజేస్తున్న అధికారులు, మండవల్లిలో మాట్లాడుతున్న న్యాయాధికారి లక్ష్మి

దివ్యాంగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు

కైకలూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అందిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో డి.రామారావు అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు కల్గిన పిల్లలకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ప్రత్యేక అవసరాలు కల్గిన పిల్లలకు ప్రభుత్వం ఎస్కార్ట్, ట్రాన్స్‌పోర్ట్, హోమ్‌బేస్డ్, ఆడపిల్లలకు స్టైఫెండ్ వారి సొంత ఖాతాలలో నేరుగా జమ అవుతుందన్నారు. ఎంఈవో-2 శ్రీనివాసరావు, ఉర్దూ స్కూల్ హెచ్‌ఎం ఎంఈ ఈసా, భవిత కేంద్రం టీచర్లు జి వెంకటలక్ష్మి, బి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

● ముదినేపల్లి: జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం విజయకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్థానిక భవిత కేంద్రంలోని ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు విద్యాశాఖ సిబ్బంది, సిఆర్‌పిలు వీల్ చైర్లు అందజేశారు. సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, హైస్కూలు ఉపాధ్యాయులు, మోహన ఫణికుమారి, బి.నీలిమ పాల్గొన్నారు.

● మండవల్లి: దివ్యాంగులపట్ల అనుచితంగా ప్రవర్తిస్తే కఠిన శిక్ష విధించవచ్చని కైకలూరు సీనియర్ సివిల్ న్యాయాధికారి వీఈఎస్‌వీ.లక్ష్మి అన్నారు. భవిత స్కూల్లో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల్లో మనోధైర్యాన్ని పెంచేలా భవిత కేంద్రం ఉపాధ్యాయులు కృషి చేయాలని, తల్లిదండ్రులు సైతం అన్ని రంగాల్లో ప్రోత్సహించాలన్నారు. న్యాయవాదులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, కూటమి నాయకులు, అభిమానులు

చిరస్థాయిగా నిలిచే అభివృద్ధి చేస్తా

పుట్టిన రోజు వేడుకలో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

కైకలూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ జన్మదిన వేడుకలు అభిమానులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలో చిరస్థాయిలో నిలిచిపోయే అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే శ్రీనివాస్ అన్నారు. కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో అభిమానులు, కూటమి నాయకుల మధ్య భారీ కేక్‌లు కట్ చేశారు. నియోజకవర్గం, ఇతర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు. పుట్టినరోజు సందర్భంగా అభిమానులు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కామినేని ఆయన తల్లి రాజేశ్వరమ్మ పేరుతో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకర్‌ను ఆయన ప్రారంభించారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. వరహాపట్నం, కైకలూరులో క్రిస్టియన్ సంఘం ఆధ్వర్యంలో భారీ కేక్‌లను కట్ చేశారు. కేవీఎస్‌ఎం నాయుడు ఆధ్వర్యంలో తాలుకా సెంటర్లో కేక్ కట్ చేశారు. శ్యామలాంబ కళామండపం వద్ద ఎంపీపీ అడవి కృష్ణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. విశాఖపట్నం నార్త్ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, మచిలీపట్నం ముడా చైర్మన్ మట్టా ప్రసాద్, బీజేపీ నాయకుడు బాబ్జి, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో కూటమి నేతలు, అధికారులు, కొల్లేరు ప్రజలు, పెద్దఎత్తున తరలివచ్చి పుష్పగుచ్ఛాలు గజమాలలు, పుస్తకాలు కామినేనికి అందించి శుభాకంక్షలు తెలిపారు. కామినేని మాట్లాడుతూ రాజకీయాల నుంచి విరమించుకుందనే సమయంలో రాష్ట్రంలో జరుగుతున్న జగన్ ప్రభుత్వం అన్యాయాలను చూడలేక ప్రజల కోరిక మేరకు పోటీ చేశానన్నారు. ప్రజల ఆప్యాయతతో మరింత ఉత్సాహంగా పని చేసి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. మరోసారి అవకాశం ఇచ్చిన ప్రజలకు న్యాయం చేస్తానన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, కూటమి నేతలు పెన్మెత్స త్రినాథరాజు, బికెఎం నాని, పేరిచర్ల ప్రసాదరాజు, వల్లభనేని శ్రీనివాస చౌదరి, సజ్జా బాబి, పైడిపాటి శివశంకర్, కాంట్రాక్టర్ కృష్ణంరాజు, నున్న రమాదేవి, ఏఈ శ్రీనివాస్, పూల రామచంద్రరావు, కొల్లి వరప్రసాద్, గోట్రు పాట్రిక్‌పాల్, ఓగిరాల శ్రీకాంత్, తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

ఉరి వేసుకుని ఒకరి ఆత్మహత్య

కలిదిండి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పేట కలిదిండి దేవుడు తోటలో నివాసం ఉంటున్న బోయిన రమేష్ (40) ఉరి వేసుకు ని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్యతో విడిపో యిన రమేష్ ఒంటరిగా ఉంటున్నాడు. మంగ ళవారం ఉదయం తల్లి వెళ్లేసరికి రమేష్ ఫ్యాన్ కి ఉరివేసుకుని చనిపోయి ఉన్నాడు. తండ్రి చిన్న వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని కైకలూరు ప్రభుత్వా సుపత్రికి తరలించారు.

సాగునీటి సంఘాలకు అభ్యర్థుల ఎంపికపై కసరత్తు

ముదినేపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సాగునీటి వినియోగదార్ల సంఘాల ఎన్నికలకు అభ్యర్థుల ఎంపికపై ఎన్‌డీఏ కూటమి నాయకులు కసరత్తు చేస్తున్నారు. పాలకవర్గాలకు ఎన్నిక ఏకగ్రీవం కావడానికి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. ముదినేపల్లి మండలంలోని 12 నీటి సంఘాలకు అధ్యక్షుల పేర్లను దాదాపు ఖరారు చేసినట్లు తెలిసింది. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌తో టీడీపీ మండల నాయకులు చర్చలు జరిపి సంఘాల అధ్యక్ష పదవులకు అభ్యర్థులను ఖరారు చేశారు. ముదినేపల్లి, పెదగొన్నూరు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ పదవులకు కూడా అభ్యర్థులు ఎంపిక పూర్తయింది. 12 నీటి సంఘాల్లో 10 సంఘాల అధ్యక్ష పదవులు టీడీపీ, 2 సంఘాల అధ్యక్ష పదవులు జనసేనకు కేటాయించారు. ముదినేపల్లి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ పదవీ టీడీపీకీ, పెదగొన్నూరు డీసీ చైర్మన్ పదవీని జనసేనకు కేటాయించారు.

నీటి సరఫరా పునరుద్ధరణ

'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్

ముసునూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తాగునీటి కోసం ఖాళీ బిందెలతో ఆందోళన శీర్షికన మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. మంగళవారం సర్పంచ్ పేరం కృష్ణ, కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు సగర్ల కాలనీకి నీరు అందించే మంచినీటి బోరు విద్యుత్ మోటారును మరమ్మతు చేసి నీటి సరఫరాను పునరుద్ధరించారు. ఈ పనులను ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ భాస్కర్‌రెడ్డి పరిశీలించారు.

చెల్లని చెక్కు ఇచ్చినందుకు..

నూజివీడు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చెల్లని చెక్కు ఇచ్చిన కేసులో నిందితుడికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.4 లక్షల జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. నూజివీడు మండలం దిగవల్లి గ్రామానికి చెందిన బర్రె శ్రీనివాసరావు 2015లో ఆదాంకు రూ.5 లక్షలు అప్పుగా ఇచ్చాడు. అనంతరం బాకీ తీర్చేందుకు ఆదాం రూ.3లక్షలకు చెక్కు ఇవ్వగా అది చెల్లలేదు. ఈ నేపథ్యంలో శ్రీనివాసరావు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా కేసును విచారించిన న్యాయమూర్తి వేల్పుల కృష్ణమూర్తి, నిందితుడు పెదపాడు మండలం అంతెకానిచెరువు గ్రామానికి చెందిన నట్టా ఆదాంకు ఆరు నెలల జైలు, రూ.4 లక్షలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

అతివేగంగా లారీ నడిపి..

నూజివీడు: 2018, జూన్ 20న కంకిపాడు మండలం దావులూరుకు చెందిన మసిముక్కు రోశమ్మ తన మనుమరాలిని నూజివీడులోని పాఠశాలలో చేర్చి తిరువూరు బస్టాండు వద్దకు వస్తుండగా పెద్దగాంధీబొమ్మ సెంటర్లో లారీని నిర్లక్ష్యంగా నడిపి ఆమెను ఢీ కొట్టాడు. దీంతో రోశమ్మ ఘటనా స్థలంలోనే మృతి చెందింది. పట్టణ పోలీసులు ఏలూరుకు చెందిన డ్రైవర్ గల్లా గంగవరప్రసాద్‌పై కేసు నమోదు చేయగా, నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి అతనికి మూడు నెలలు జైలు శిక్ష, రూ.500లు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో

బాల్య వివాహాల నిరోధక కమిటీల ఏర్పాటు

ముదినేపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టేందుకు గ్రామ స్థాయిలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తు న్నట్లు జడ్పీ సీఈవో విజయరాజు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి మంగళవారం ఐసీడీఎస్ అధికారులు కిశోర వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాలను నిరోధించడమే కాక గ్రామీణ ప్రాంత ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు కమిటీలు కృషి చేస్తాయని తెలిపారు. ఎంపీడీవో రామకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్ జోనాతన్, ఐసీడీ ఎస్ సూపర్‌వైజర్ ప్రసూన, యూటీఎఫ్ మండల అధ్యక్షురాలు ఎం.సాయిలక్ష్మి, జూనియర్ కళాశాల లెక్చరర్ జానకిదేవి పాల్గొన్నారు. అనంతరం మండలంలో హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్ పనులపై జడ్పీ సీఈవో గ్రామ కార్యదర్శులతో సమీక్షించారు.

మినుము సాగులో మెళకువలు పాటించండి



రైతులకు సూచనలిస్తున్న అధికారులు

ముదినేపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడూరు, పెదపాలపర్రులో వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహిం చారు. ధాన్యం కొనుగోలు నిబంధనలు, రెండో పంటగా మినుము సాగులో మెళుకువలు, పంటల బీమాపై ఏడీఏ జి.వెంకటమణి రైతు లకు సూచనలు ఇచ్చారు. వర్షాలకు తడిసిన ధాన్యం రంగు మారకుండా వరి పైరుపై ఎకరాకు 25 కేజీల ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయాలని ఏవో వేణుమాధవ్ తెలిపారు. ద్రవ జీవామృతం తయారీ విధానాన్ని మండల ప్రకృతి వ్యవసాయ విభాగం ఇన్‌చార్జ్ గౌతం కుమార్ వివరించారు. టీడీపీ నాయకులు అడుసుమిల్లి వెంకట్రావు, వల్లభనేని శివాజీ, వీఏఏలు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

మండవల్లి డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం గుడ్లవల్లేరు, గుడివాడ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర పరీక్షలు నిర్వ హించారు. లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ శశికళ, వైపీవీ.ప్రసాద్ శిబిరాన్ని ప్రారంభించారు. పాఠశాలలో 517 మంది విద్యార్థులను పరీక్షించారు. సుమారు 70 మందికి కళ్లజోళ్లను అంద జేస్తామని శశికళ తెలిపారు.